

అమరావతి వెళ్లిన కలెక్టర్

పార్వతీపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తొలిసారిగా జిల్లా కలెక్టర్లతో సోమవారం అమరావతిలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో పాల్గొనేందుకు జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదివారం అమరావతి బయలుదేరి వెళ్లారు. ఈ ఐదేళ్లలో జిల్లా అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలు, పనులు, తదితర అంశాలపై చంద్రబాబుకు నివేదిక రూపంలో వివరించనున్నారు. అదే విధంగా గత ఐదేళ్లలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, వాటి ప్రగతిని వివరించనున్నట్టు సమాచారం.

- ఒకప్పుడు రిజర్వ్ ఫారెస్ట్ ● ఇప్పుడు రెవెన్యూ ప్రాంతం
- వైసీపీ పాలనలో మారిన సర్వే
- బడిదేవరమ్మ కొండపై గ్రానైట్ తవ్వకాలకు అనుమతులు
- దీని వెనుక గత ప్రభుత్వ పెద్దల హస్తం
- అడ్డుకోవాలని కూటమి ప్రభుత్వానికి స్థానికుల విన్నపం



బడిదేవరమ్మ కొండ

సర్వే మాయ!

(పార్వతీపురం ఆంధ్రజ్యోతి)

పార్వతీపురం మండలం గంగాపురం పంచాయతీ సర్వే నెంబర్-1లో ఉన్న బడిదేవరమ్మ కొండను గతంలో రిజర్వ్ ఫారెస్ట్‌గా అధికారులు గుర్తించారు. ములగ, కోరి, సంగంవలస తదితర ప్రాంతాలను కలుపుకొని మొత్తం 568.4 ఎకరాలు రిజర్వ్ ఫారెస్ట్‌గా 1963లో డిక్లేర్ చేశారు. ముందుగా సెక్షన్-4 నోటిఫికేషన్ జారీచేసి రిజర్వ్ ఫారెస్ట్‌గా ఆ ప్రాంతాన్ని రికార్డుల్లో నమోదు చేశారు. తర్వాత సంగంవలస రిజర్వ్ ఫారెస్ట్‌లో 210 ఎకరాల్లో గిరిజనులు పోడు వ్యవసాయం చేస్తున్నారని, వారికి ఆ భూములు కేటాయించాలని నిర్ణయించారు. ఈ మేరకు 568.4 ఎకరాల్లో 210 ఎకరాలను డి రిజర్వ్ చేశారు. మిగిలిన ప్రాంతాన్ని రిజర్వ్ ఫారెస్ట్‌గా కొనసాగిస్తున్నారు. అయితే, ఈ ప్రాంతంలో గ్రానైట్ కొండలు ఉండడంతో వాటిపై కొంతమంది బడా కాంట్రాక్టర్ల కన్నుపడింది. బడిదేవరమ్మ కొండపై గ్రానైట్ తవ్వకాల అనుమతుల కోసం సంబంధిత అధికారులకు దరఖాస్తు చేశారు. రెవెన్యూశాఖ సిఫారసు మేరకు 2014లో కోరి సర్వే నెంబర్-1లో 16.76 ఎకరాల్లో గ్రానైట్ తవ్వకాలకు గనుల శాఖ అనుమతులు మంజూరు చేసింది. దీనిపై అప్పట్లో ఆ ప్రాంత ప్రజల నుంచి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమవడంతో అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం గ్రానైట్ తవ్వకాల అనుమతులను నిలిపివేసింది. కాగా, రిజర్వ్ ఫారెస్ట్ నుంచి కోరి సర్వే నెంబర్-1 ప్రాంతాన్ని తప్పించేందుకు అప్పటి డీఎఫ్‌వో రమణమూర్తి కాంట్రాక్టర్లతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మేరకు 2016లో రూ.5లక్షల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. కోరి సర్వే నెంబర్-1లో గ్రానైట్ తవ్వకాలకు అనుమతులు తీసుకొని ములగ ప్రాంతంలో క్వారీ తవ్వకాలు చేపడుతున్నారని హైకోర్టులో ప్రైవేటు వ్యక్తులు పిటీషన్ దాఖలు చేశారు. దీనిపై రమణమూర్తి అనంతరం డీఎఫ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మణ దర్యాప్తు నిర్వహించి ములగ ప్రాంతంలోనే గ్రానైట్ తవ్వకాలు జరుగుతున్నాయని నివేదికను హైకోర్టుకు అందించారు. గ్రానైట్ తవ్వకాలకు ఇచ్చిన ప్రాంతం రిజర్వ్ ఫారెస్ట్‌గా పేర్కొని హైకోర్టుకు నివేదిక అందించారు. అటవీ, రెవెన్యూ, గనుల శాఖలు ఒక్కొక్క నివేదిక ఇవ్వడంతో అప్పటి జిల్లా కలెక్టర్ వివేక్‌యాదవ్ దీనిపై స్టేట్ లెవెల్ కమిటీ వేయాలని ప్రభుత్వానికి రికమెండ్ చేశారు. స్టేట్ లెవెల్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా గ్రానైట్ తవ్వకాలకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని 2018లో గనులశాఖ డైరెక్టర్‌కు హైకోర్టు ఆదేశించింది. ఈ కథ హైకోర్టు జోక్యంతో 2019లో ముగిసింది.

వైసీపీ ప్రభుత్వ హయాంలో అనుమతులు

హైకోర్టు ఆదేశాలతో టీడీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా గ్రానైట్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదు. కానీ, కాంట్రాక్టర్లు మాత్రం ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. 2020లో వైసీపీ ప్రభుత్వ హయాంలో రిజర్వ్ ఫారెస్ట్ ఆఫ్ ఇండియాను ఆశ్రయించారు. మళ్లీ హైకోర్టు ఆదేశాలతో 2021లో ఫారెస్ట్ ఆఫ్ ఇండియా బృందం సర్వే నిర్వహించింది. ఆ ప్రాంతం రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉందని స్థానిక అధికారులు రికార్డులతో సహా వాదించినప్పటికీ ఈ బృందం పట్టించుకోలేదు. రెవెన్యూ ప్రాంతమని చెప్పి గ్రానైట్ తవ్వకాలకు అనుకూలంగా 2022లో హైకోర్టుకు నివేదిక ఇచ్చింది. హైకోర్టు ఆదేశాలతో 2023 జనవరి 29న సర్వే నెంబర్-1లోని బడిదేవరమ్మ కొండపై గ్రానైట్ తవ్వకాలకు అనుమతులు మంజూరు చేస్తూ గనుల శాఖ ఆదేశాలు జారీ చేసింది. దీని వెనుక అప్పటి వైసీపీ పెద్దల హస్తం ఉన్నట్టు ఆరోపణలు ఉన్నాయి. 1963లో రిజర్వ్ ఫారెస్ట్‌గా గుర్తించిన ఈ ప్రాంతం రెవెన్యూశాఖకు ఎలా చెందుతుందో, ఏ విధంగా గనులశాఖ అనుమతులు మంజూరు చేసిందో తెలియని పరిస్థితి ఏర్పడింది. దీనిపై ఏది వాస్తవం, ఏది అవాస్తవం తేల్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం దృష్టిసారించి బడిదేవరమ్మ దేవత నిలయంగా ఉన్న బడిదేవరమ్మ కొండ వద్ద ఎటువంటి గ్రానైట్ తవ్వకాలు తప్పకుండా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

మాతో సంప్రదింపులు జరపలేదు..

కోరి రెవెన్యూ పరిధి సర్వే నెంబర్-1లో ఉన్న బడిదేవరమ్మ కొండ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంగా మా రికార్డుల్లో నమోదైంది. ఆ ప్రాంతంలో గ్రానైట్ తవ్వకాలకు ఎటువంటి అనుమతులు మంజూరు చేయ కూడదు. కానీ, గనుల శాఖ మాతో సంప్రదింపులు చేయకుండా గ్రానైట్ తవ్వకాలకు అనుమ తులు మంజూరు చేసింది. ఈ విషయాన్ని మా శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

-ప్రసన్న, జిల్లా అటవీశాఖ అధికారిణి

అనుమతులు మంజూరు చేయలేదు..

బడిదేవరమ్మ కొండపై గ్రానైట్ తవ్వకాలకు సంబంధించి అనుమతులు రాష్ట్ర కార్యాలయం నుంచి వచ్చాయి. కానీ, జిల్లా స్థాయిలో అనుమతులు మంజూరు చేయలేదు. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

-శ్రీనివాసరావు, మైనింగ్ శాఖ ఏడీ

రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా..

- అమలులోకి కొత్త రవాణా చట్టం ● నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- మద్యం తాగి వాహనం నడిపితే.. భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు ● జరిమానా, జైలు శిక్ష విధింపు



కొమరాడ, ఆగస్టు 4: రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కొత్తగా రవాణా చట్టాన్ని అమలు లోకి తెచ్చింది. దీని ప్రకారం.. మద్యం తాగి వాహనాలు నడిపితే.. ఇక భారీ మూల్యం చెల్లించకోక తప్పదు. నిబంధ నలు పాటించకుంటే జైలు శిక్ష, భారీగా జరిమానా కూడా తప్పదు. మద్యం తాగి వాహనాలను నడపడంతో పాటు మితిమీరిన వేగం, ఇలా ఏదో ఒక కారణంతో రోడ్డు ప్రమా దాలు సంభవిస్తున్నాయి. దీంతో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. తమ తప్పు లేకపోయినా.. ఎదుటి వారి వల్ల ఇబ్బందులు పడేవారు అనేకమంది ఉన్నారు. ఈ నేపథ్యంలో ఇటువంటి రోడ్డు ప్రమదాలను కట్టడి చేసేందుకు కేంద్ర సర్కారు పకడ్బందీగా చట్టాన్ని రూపొందించింది. ఇప్పటికే దాని విధి విధానాలు, జరిమానాలు తదితర వివరాలను పోలీస్ స్టేషన్లకు పంపారు. దీంతో జిల్లా పోలీసులు కూడా బ్రీత్ అనలైజర్ పరికరంతో ముమ్మరంగా వాహన తనిఖీలు చేపడుతున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై దృష్టి సారిస్తున్నారు.

జరిమానా ఇలా..

మద్యం తాగి వాహనాలు నడిపే వారు మొదటిసారి పట్టుబడితే.. రూ. 10 వేల చొప్పున జరిమానా విధించే అవకాశం ఉంది. రెండోసారి పట్టుబడితే రూ. 15 వేలు , రెండేళ్లు జైలు శిక్ష విధించనున్నారు. దీనిపై పోలీసులు ప్రచారం కూడా చేస్తున్నారు. ట్రాఫిక్‌లో రెడ్ లైట్ పడిన తరువాత వాహనం ఆపకుండా వెళ్లిపోతే.. గతంలో రూ. 100 ఉండే జరిమానాను రూ. 500కు పెంచారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే గతంలో రూ. 500 విధించేవారు. దీనిని రూ. 5 వేలకు పెంచారు. అతి వేగంగా వాహనాలు నడి పితే గతంలో రూ. 400 ఉండే జరిమానాను రూ. వెయ్యి వరకు పెంచారు. ప్రమాదకరంగా వాహనాలు నడిపితే రూ. వెయ్యి ఉండే ఫైన్‌ను రూ. 5 వేలకు పెంచారు. మద్యం తాగి వాహ నాలు నడిపితే ఇదివరకు రూ. 2 వేలు ఉండే జరిమానా రూ. 10 వేలకు పెరిగింది. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే ఇదివరకు ఫైన్ రూ. 100లు ఉండేది. ఇప్పుడు రూ. వెయ్యికి పెంచి మూడు నెలలు లైసెన్స్ రద్దు చేయనున్నారు. బైక్ న డుపుతూ సెల్‌ఫోన్‌లో మాట్లాడినా, ముగ్గురు ప్రయాణించి నా రూ. 1200 ఫైన్ పడుతుంది. భీమా లేకుండా వాహనం నడిపితే రూ. 2 వేలు జరిమానా విధిస్తారు. సీటు బెల్టు లే కుండా వాహనాలు నడిపితే రూ. వెయ్యి జరిమానా పడు తుంది. వీటిని దృష్టిలో ఉంచుకొని వాహనదారులు రోడ్డు ఎ క్కాలని కొమరాడ ఎస్ఐ నీలకంఠం తెలిపారు. రోడ్డు ప్రమా దాలను నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.



ఆటో డ్రైవర్‌ను బ్రీత్ అనలైజర్ పరికరంతో పరీక్షిస్తున్న ఎస్ఐ నీలకంఠం

తాగునీటి సమస్య లేని గ్రామాలే లక్ష్యం

- ఫీడర్ అంబులెన్స్‌లు మంజూరు చేస్తాం
- గిరిజన ఆడపిల్లలు మంచి స్థానంలో ఉండాలి
- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి
- ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

సాలూరు, ఆగస్టు 4: నియోజకవర్గంలో తాగునీటి సమస్య లేకుండా చేయడమే తన లక్ష్యమని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఈ నెల 9న జరగనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని సాలూరు పట్టణంలో ముందస్తుగా ఆదివారం ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో ఆదివాసీలు స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. థింసా, కోయ డ్యాన్స్‌లు చేశారు. అక్కడ నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా చేపట్టిన ర్యాలీని మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఆమె కూడా గిరిజన మహిళలతో కలిసి థింసా నృత్యం చేశారు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న ఓ కమ్యూనిటీ హాల్‌లో ప్రపంచ ఆదివాసీ వేడుకలు నిర్వహించారు. అడవి తల్లికి గిరిజన సంప్రదాయ బద్ధంగా మంత్రి పూజించి చీర సమర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 'నేను ఎన్నికల ప్రచారంలో తాగునీరు లేని గిరిజన గ్రామాలను ఎన్నో చూశా. ఇంటికి వెళ్లిన తర్వాత నీరు తాగినప్పుడల్లా ఆ గ్రామాలే నాకు గుర్తుకు వచ్చేవి. అందుకే అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.3కోట్లతో 31 గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించాం. ఇంకా 70 గ్రామాలకు మరో 15 రోజుల్లో తాగునీరు సమస్య లేకుండా చేస్తాం. దీనికోసం నిధులు తెస్తాం. ఏ గ్రామంలో తాగునీటి సమస్య ఉన్నా పార్టీలకు అతీతంగా నాకు చెప్పాలి. మీకు నిత్యం అందుబాటులోనే ఉంటా. డోలీ మోతలు లేకుండా అన్ని గిరిజన గ్రామాలకు ఫీడర్ అంబులెన్స్‌లు త్వరలోనే మంజూరు చేస్తాం. గిరిజన ఆడపిల్లలు బాగా చదివి మంచి స్థానంలో ఉండాలి. నేను ఈ రాష్ట్రానికి మంత్రిని అయినప్పటికీ మీ ఆడపడుచునే. నియోజకవర్గంలో ప్రధానంగా విద్య, వైద్యం, తాగునీరు, సాగునీరు, రహదారులపై పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తాం. ప్రతీ గిరిజన గ్రామానికి కూడా రహదారి ఉండేలా చర్యలు తీసుకుంటాం. నేను గిరిజనేతరులకు ఉద్యోగాలు వేస్తున్నట్టు అసత్య ఆరోపణలు చేయటం సరికాదు. ఏకలవ్య పాఠశాలలకు సంబంధించి 85 మంది నా గిరిజన పిల్లలకు ఉద్యోగాలు ఇచ్చాను. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపదికన రెండు ఉద్యోగాలు బీసీలకు ఇవ్వటం తప్పా.' అని మంత్రి అన్నారు. అనంతరం ఆమెను గిరిజనులు ఘనంగా సత్కరించారు. విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు, డాక్టర్ మంచాల వెంకటరమణ, మాజీ జడ్పీటీసీ మంచాల పారమ్మ, జీసీసీ మేనేజర్ జి.రామారావు, టీడీపీ ఎస్టీ సెల్ నాయకులు, గిరిజన సంఘం నాయకులు, గిరిజనులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





ఆకట్టుకున్న కోలాటం, థింసా నృత్యం

ఖరీఫ్‌కు సాగునీటి కష్టాలు



ఎడమ కాలువ పరిధిలో శిథిలమైన షట్టర్లు

- అధ్వానంగా తోటపల్లి కాలువలు
- శిథిలావస్థలో షట్టర్లు ● రైతులకు తప్పని ఇబ్బందులు
- చందాలతో బాగు చేసుకుంటున్న వైనం

(గరుగుబిల్లి)

తోటపల్లి ప్రాజెక్టు పాత రెగ్యులేటర్‌కు చెందిన ఎడమ, కుడి కాలువల పరిధిలోని రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. రెండు కాలువలతో పాటు వీటి పరిధిలోని షట్టర్లు అధ్వానంగా ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం కాలువల ఆధునికీకరణపై దృష్టి సారించలేదు. దీంతో ఈ ఖరీఫ్‌లో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. 2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.193 కోట్లు నిధులు మంజూరయ్యాయి. కొన్ని పనులు చేపట్టారు. అనంత రం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పనులను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఐదేళ్ల పాలనలో కేవలం 25 శాతం లైనింగ్ పనులు నిర్వహించి మిగతా వాటిని నిలుపుదల చేసింది. ఒకవైపు కాలువలు అధ్వానంగా, మరోవైపు షట్టర్లు అధికంగా మరమ్మతులకు గురయ్యాయి. బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన నిర్మాణాలు ప్రస్తుతం ఊడుతున్న పరిస్థితి నెలకొంది. షట్టర్లు అధికంగా తుప్పు పట్టడంతో కాలువల గుండా సాగునీరు వెళ్లలేని పరిస్థితి ఉంది. ప్రధాన ఎడమ కాలువ నుంచి గరు గుబిల్లి, జియ్యమ్మవలస, పాలకొండ, వీరఘట్టం మండలాల పరిధిలోని 81 గ్రామాలకు సంబంధించి 35 వేల ఎకరాలకు పైగా, కుడి కాలువ పరిధి లో గరుగుబిల్లి, వంగర, బలిజిపేట మండలాల పరిధిలోని 28 గ్రామా ల్లోని 9,500 ఎకరాలకు పైగా, ఎడమ కాల్వ పరిధిలో 10 ఓపెన్ హెడ్ చానల్స్ నుంచి 57 గ్రామాల్లోని 12,450 ఎకరాలకు, కుడి హెడ్ చానల్స్ నుంచి 21 గ్రామాలకు సంబంధించి 2,180 ఎకరాలకు నీరు అందాల్సి ఉంది. పాలకొండ, కురుపాం, రాజాం నియోజకవర్గాల పరిధిలోని 203 గ్రామాల్లోని 26 చానల్స్ ద్వారా, రెండు కాలువల నుంచి సుమారు 65 వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. అయితే, వైసీపీ ఐదేళ్ల పాలనలో కాలువలపై కన్నెత్తి చూసిన పాపాన లేదని రైతులు వాపోతున్నారు. రెండు కాలువలు పరిధిలో షట్టర్లు అధ్వానంగా తయారయ్యాయి. రెండు కాలువల నుంచి గతనెల 13న సాగునీరు విడుదల చేశారు. అయితే కాలువల నుంచి అధికంగా నీరు సరఫరా చేస్తే గండ్లు పడే అవకాశం ఉంది. దీంతో తక్కువ స్థాయిలో సరఫరా చేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం వీరఘట్టం మండలం నరిసపురం ప్రాంతంలో కాలువకు గండి పడింది. దీంతో ఎడమ కాలువ పరిధిలోని రైతులకు సాగునీరు సరఫరా కాకపోవడంతో ఉభాలు చేసుకోలేని స్థితిలో ఉన్నారు. కాల్వల నిర్వహణకు ప్రస్తుతం అధికారుల వద్ద నిధులు లేకపోవడంతో రెండు కాలువల పరిధిలోని గండ్లు, పిచ్చి మొక్కలు తొలగింపు కార్యక్రమాలను రైతులే స్వయంగా చందాలు వేసుకొని పనులు నిర్వహించుకుంటున్నారు. శివారు ప్రాంత రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరును తరలించేందుకు రైతులే ముందుకు వస్తున్నారు. నిధులు లేమితో అధికారులు చేతులెత్తేసిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం దృష్టి సారించి రెండు కాలువల పరిధిలో ఆధునికీకరణకు అవసరమైన నిధులు కేటాయిస్తే రైతులకు సాగునీటి కష్టాలు తప్పుతాయి.



చందాలు వేసుకుని యంత్రంతో కాలువ గండిని పూడ్చుతున్న దృశ్యం

ప్రతిపాదనలు పంపించాం..

రెండు కాల్వల పరిధిలో అవసరమైన మరమ్మతుల నిర్వహణకు ప్రతిపాదనలు పంపించాం. రూ. 45 లక్షలతో అంచనాలు వేయడం జరిగింది. రెండు కాల్వల పరిధిలో సాగు నీరుకు ఆటంకం కలగకుండా ఉండేలా చర్యలు చేపడుతున్నాం. నిధులు మంజూరు కాగానే గతంలో పడిన గండ్లను పూర్తిస్థాయిలో పూడుస్తాం. ప్రస్తుతం శివారు ప్రాంతాల రైతులు కాలువల నుంచి సాగునీరును మళ్లించుకునేందుకు ముందుకు వస్తున్నారు. నిధులు సమస్య కారణంగా ముందుగా పనులు నిర్వహించలేకపోయాం.

-డి.రవికుమార్, పాత రెగ్యులేటర్ డీఈ, పాలకొండ

నవ్య | చిత్రజ్యోతి

మెగా విరాళం

కేరళ సీఎం సహాయ నిధికి చిరంజీవి, రామ్‌చరణ్ రూ. కోటి, అల్లు అర్జున్ రూ. 25 లక్షలు





కేరళలోని వయనాడ్ జిల్లాలో కొండచరియలు విరిగి పడి నష్టపోయిన కుటుంబాలకు ఆసరా అందించేందుకు.. కేరళ ముఖ్యమంత్రి సహాయనిధికి ఇప్పటికే పలువురు సినీతారలు విరాళాలు అందించిన సంగతి తెలిసిందే. ఆదివారం మెగాస్టార్ చిరంజీవి, రామ్‌చరణ్, అల్లుఅర్జున్ కూడా బాధితులు విరాళాలు ప్రకటించారు. చిరంజీవి, రామ్‌చరణ్ రూ.కోటి విరాళం అందించి, ఈ విపత్తులో నష్టపోయిన కుటుంబాలకు తమ వంతు సహాయాన్ని చాటారు. "ప్రకృతి విపత్తు వల్ల జరిగిన ఈ ప్రాణ నష్టాన్ని చూస్తుంటే నా గుండె బరువెక్కిపోతోంది. బాధితుల కుటుంబాలు త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను" అని చిరంజీవి ఎక్స్‌లో పేర్కొన్నారు. మరోవైపు, ఆదివారం ఉదయం అల్లు అర్జున్ కూడా రూ.25 లక్షల విరాళం ప్రకటించారు. "కేరళలో జరిగిన ఈ సంఘటన నన్ను తీవ్రంగా కలిచివేసింది. కేరళ ప్రజలు నాపై ఎంతో ప్రేమ చూపారు. వారి కోసం నా వంతుగా నేను ఈ సహాయం చేస్తున్నాను" అని అల్లు అర్జున్ ఎక్స్‌లో పేర్కొన్నారు. సంయుక్త మీనన్ కేరళలో సహాయ కార్యక్రమాలు చేపడుతున్న విశ్వశాంతి ఫౌండేషన్‌కు విరాళం అందించినట్లు తెలిపారు. కానీ ఆమె ఎంత మొత్తం అందించారు అనేది గోప్యంగా ఉంచారు.

క్లైమాక్స్‌లో...



చిరంజీవి కథానాయకుడిగా తెరకెక్కుతోన్న సోషియో-ఫాంటసీ ఎంటర్‌టైనర్ 'విశ్వంభర'. ప్రస్తుతం హైదరాబాద్‌లో క్లైమాక్స్ చిత్రీకరణ జరుగుతున్నట్లు యూనిట్ ఆదివారం ప్రకటించింది. 'సినిమా మొత్తం ఒకెత్తు, క్లైమాక్స్ ఒక్కటి మరో ఎత్తు అనేలా ఉండబో తోంది, భారీ సెట్స్, విజువల్ ఎఫెక్ట్స్‌తో దర్శకుడు వశిష్ఠ క్లైమాక్స్ సీక్వెన్స్‌ను దృశ్యకావ్యంలా తెరకెక్కిస్తున్నార'ని మేకర్స్ తెలిపారు. పతాక సన్నివేశాలకు ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్ అనల్ అరసు నేతృత్వం వహిస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి 10న 'విశ్వంభర' ప్రేక్షకుల ముందు కొస్తోంది. విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. త్రిష హీరోయిన్.

విజేతలు వీరే...

















దక్షిణాది తారలంతా తళుక్కున మెరిసిన '69వ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ 2024' వేడుక శనివారం రాత్రి అట్టహాసంగా జరిగింది. గెలుపు గుర్రాలకు పురస్కారాలను అందించారు. సిద్ధార్థ్ నటించిన తమిళ చిత్రం 'చిన్నా' అత్యధికంగా ఏడు అవార్డులు కొల్లగొట్టగా.. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో నాని, కీర్తి సురేశ్ జంటగా తెరకెక్కిన 'దసరా' చిత్రం ఆరు విభాగాల్లో పురస్కారాలను కైవసం చేసుకుంది. ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య నటించిన 'బేబీ'.. మణిరత్నం తెరకెక్కించిన 'పొన్నియన్ సెల్వన్ 2' ఐదు అవార్డులతో మూడో స్థానంలో నిలిచాయి. తమిళంలో ఉత్తమ నటుడిగా 'పొన్నియన్ సెల్వన్ 2' చిత్రానికి విక్రమ్.. 'మామన్నన్' (నాయకుడు) సినిమాకు ఉత్తమ సహాయ నటుడిగా 'పుష్ప' ఫేమ్ ఫహాద్ ఫాజిల్, ఉత్తమ నటిగా 'చిన్నా' చిత్రానికి నిమిషా సజయన్ ఎంపికయ్యారు. తెలుగువారిని విశేషంగా అలరించిన కన్నడ చిత్రం 'సప్త సాగరాలు దాటి' చిత్రానికి ఉత్తమ నటుడిగా రక్షిత్ శెట్టి, ఉత్తమ నటిగా రుక్మిణీ వసంత్ ఎంపికయ్యారు. మలయాళ నటుడు మమ్ముట్టి 'నన్‌పకల్ నేరతు మయక్కం' చిత్రానికి ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. అవార్డుల ప్రదానోత్సవంలో నాని మాట్లాడుతూ "కెరీర్ తొలినాళ్లలో అవార్డులు అందుకోవాలనే ఆసక్తి ఉండేది. ఇప్పుడు నేను నటించిన, నిర్మించిన సినిమాల్లోని నటీనటులు ఈ అవార్డులు అందుకుంటుంటే చూడాలని ఉంది. నాతో సినిమాలు తీసిన ఇద్దరు నూతన దర్శకులు అవార్డులు అందుకొన్నందుకు ఆనందంగా ఉంది" అని చెప్పారు. "ఓ అభిమాని చేసిన పనిని నేను ఇప్పటికీ మర్చిపోలేదు. ఓ అభిమాని.. ఓ రోజు హఠాత్తుగా పెళ్లి చేసుకుంటానని.. ఇంటి వాకిలి ముందు వాలిపోయాడు. ఆ సంఘటనతో ఒక్కసారిగా షాక్ అయ్యా" అని కీర్తి సురేశ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి వాఖ్యాతలుగా సందీప్ కిషన్, ఫరియా అబ్దుల్లా, విశాఖ వాఖ్యాతలుగా వ్యవహరించారు.

తెలుగు సినిమా విజేతల వివరాలు

ఉత్తమ చిత్రం - బలగం
ఉత్తమ దర్శకుడు - వేణు ఎల్డంది (బలగం)
ఉత్తమ పరిచయ దర్శకుడు - శ్రీకాంత్ ఓదెల (దసరా), శౌర్యువ్ (హాయ్ నాన్న)
ఉత్తమ దర్శకుడు(విమర్శకుల ఎంపిక) - సాయి రాజేశ్ (బేబీ)
ఉత్తమ నటుడు - నాని (దసరా)
ఉత్తమ నటుడు (విమర్శకుల ఎంపిక) - ప్రకాశ్ రాజ్(రంగ మార్తాండ), నవీన్ పొలిశెట్టి (మిస్ శెట్టి, మిస్టర్ పొలిశెట్టి)
ఉత్తమ నటి - కీర్తి సురేశ్,
ఉత్తమ నటి (విమర్శకుల ఎంపిక) - వైష్ణవి చైతన్య (బేబీ)
ఉత్తమ సహాయ నటుడు - బ్రహ్మానందం (రంగమార్తాండ), రవితేజ (వాల్తేరు వీరయ్య)
ఉత్తమ సహాయ నటి - రూపా లక్ష్మి (బలగం)
ఉత్తమ మ్యూజిక్ ఆల్బమ్ - బేబీ
ఉత్తమ గీత రచయిత - అనంత శ్రీరామ్ (బేబీ)
ఉత్తమ నేపథ్య గాయకుడు - శ్రీరామ చంద్ర (ఓ రెండు ప్రేమ మేఘాలిలా - బేబీ)
ఉత్తమ నేపథ్య గాయని - శ్వేతా మోహన్ (మాస్టారు మాస్టారు - సార్)
ఉత్తమ సినిమాటోగ్రఫీ - సత్యన్ సూరన్ (దసరా).



క్రేజీగా రాంబో



షమ్ము హీరోగా హరీశ్ మధురెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'క్రేజీ రాంబో'. ర్యాప్‌రాక్ షకీల్ నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమాను ప్రారంభించి టైటిల్‌ను లాంచ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో అశ్విన్‌బాబు మాట్లాడుతూ "టైటిల్ చాలా ఆసక్తికంగా ఉంది. సినిమా తప్పకుండా మంచి విజయం సాధించాలి" అని చెప్పారు. హీరో షమ్ము మాట్లాడుతూ "ఈ సినిమా కథ అద్భుతంగా ఉంటుంది" అని చెప్పారు. "చాలా మంచి కంటెంట్ ఉన్న చిత్రమిది" అని నిర్మాత ర్యాప్‌రాక్ షకీల్ అన్నారు.

స్కూల్ లైఫ్‌ను గుర్తుకు తెచ్చేలా



ప్రియదర్శి, విశ్వదేవ్, భాగ్యరాజ్, నివేత థామస్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం '35 చిన్న కథ కాదు'. నంద కిషోర్ ఈమాని దర్శకత్వంలో రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించారు. ఈ నెల 15న సినిమా విడుదలవుతోంది. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఈ చిత్రం నుంచి 'సయ్యారే సయ్యా' పాటను విడుదల చేశారు. అందరికీ స్కూల్ లైఫ్ జ్ఞాపకాలను, బాల్య స్నేహాలను గుర్తుకు తెచ్చేలా సాగిందీ పాట. కిట్టు విస్సాప్రగడ సాహిత్యం అందించగా, కార్తీక్ ఆలపించారు. వివేక్ సాగర్ సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటర్: టి.సి.ప్రసన్న, డీఓపీ: నికేత్ బొమ్మ.



డబుల్... కిక్ ఇచ్చింది

'కమర్షియల్ సినిమా అంటే గుర్తుకొచ్చేది పూరి జగన్నాథ్. ఆయన ఇప్పటివరకూ చేసిన సినిమాల్లో ఎక్కువ సమయం, కష్టం పెట్టిన సినిమా 'డబుల్ ఇస్మార్ట్'. స్ర్కిప్ట్ విన్నప్పుడు ఎంత కిక్ వచ్చిందో, ఇస్మార్ట్ శంకర్ పాత్రలో నటిస్తున్నప్పుడూ అంతే కిక్ ఇచ్చింది. త్వరలో థియేటర్లలో కలుద్దాం' అని హీరో రామ్ పోతినేని అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం ఈ నెల 15న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని ఆదివారం వైజాగ్‌లో నిర్వహించారు. పూరి జగన్నాథ్ వీడియో సందేశంలో మాట్లాడుతూ 'వైజాగ్ గల్లీల్లో తిరిగినవాణ్ణి. నేను తీసిన గల్లీ సినిమా ఇది. నీ సెంటర్లలో విజిల్స్ వేస్తూ చూడండి' అని ప్రేక్షకులను కోరారు. థియేటర్‌కి పట్టిన తుప్పును వదలగొట్టే సినిమా ఇదని అలీ అన్నారు. ఒక మంచి చిత్రంలో భాగమైనందుకు ఆనందంగా ఉందని హీరోయిన్ కావ్యథాపర్ చెప్పారు.

గొప్ప సినిమాగా నిలిచిపోతుంది



క్లుప్తంగా...

"తంగలాన్ వందేళ్ల క్రితం జరిగిన కథ. అందమైన సాహసోపేత ప్రయాణం ఈ సినిమా. మిమ్మల్ని ఆశ్చర్యంలో ముంచెత్తాలని ఈ సినిమా గురించిన ముఖ్యమైన విషయాలేవి బయటకు చెప్పలేదు. నా కెరీర్‌లో అత్యుత్తమ పాత్రను ఈ సినిమాలో చేశాను' అని హీరో విక్రమ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా పా రంజిత్ రూపొందించిన చిత్రమిది. ఈ నెల 15న విడుదలవుతోంది. చిత్రబృందం ఆదివారం హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. పా రంజిత్ మాట్లాడుతూ 'మనదేశంలో అణచివేత, అసమానత్వం ఇంకా ఉన్నాయి. వీటిని ఎదుర్కొనేందుకు నేను సినిమాను మాధ్యమంగా ఎంచుకున్నాను. నా గత చిత్రాల్లానే 'తంగలాన్'ను కూడా తెలుగు ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. తంగలాన్ ప్రచార చిత్రాల్లో మా కష్టం కనపడుతోంది అని నిర్మాత జ్ఞానవేల్ రాజా అన్నారు.

సందేశాన్నిచ్చే 'సింబా'



జగపతిబాబు, అనసూయ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సింబా'. మురళీ మనోహర్ దర్శకత్వంలో సంపత్ నంది, దాసరి రాజేందర్‌రెడ్డి నిర్మించారు. ఈ నెల 9న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జగపతిబాబు మాట్లాడుతూ "ఇది ప్రకృతి మీద ఉన్న ప్రేమతో తీసిన సినిమా. ఈ సినిమా అందరికీ నచ్చుతుంది" అని తెలిపారు. నిర్మాత సంపత్ నంది మాట్లాడుతూ "ఈ సినిమా వినోదంతో పాటు మంచి సందేశాన్ని ఇస్తుంది. ఇది సమాజం కోసం తీసిన సినిమా" అని అన్నారు. "సినిమా చాలా కొత్త పాయింట్‌తో ఉంటుంది. సంపత్ నంది అద్భుతమైన కథను ఇచ్చారు" అని దర్శకుడు మురళీ మనోహర్ చెప్పారు. "వనజీవి రామయ్య' జీవితం ఆధారంగా ఈ కథను రాసుకున్నారు సంపత్ నంది" అని నిర్మాత దాసరి రాజేందర్‌రెడ్డి అన్నారు.

ఆ 67 కోట్లు వదిలేస్తారా?



- ఈ-ఆటో కొనుగోళ్లలో ఎస్సీ కార్పొరేషన్ సొమ్ము స్వాహా
- అడ్వాన్స్ తీసుకుని సరఫరా చేయని డీలర్లు
- అడ్వాన్స్ తిరిగి చెల్లించకపోయినా పట్టించుకోని గత ప్రభుత్వం
- వారికి అండదండలందించిన ఓ ఐఏఎస్ అధికారి
- ఇప్పుడైనా వసూలు చేస్తారో లేదో!

> వైసీపీకి ముఖ్యుడైన ఆ ఐఏఎస్ అధికారి కారణంగా ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.67 కోట్లు గండిపడింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను అప్పనంగా ఓ డీలర్‌కు ఇచ్చేశారు. ఈ-ఆటోల కొనుగోలు కోసం అడ్వాన్స్ చెల్లించినా ఆ డీలర్ ఆటోలు సరఫరా చేయకపోగా, తిరిగి ఆ సొమ్మును కూడా ప్రభుత్వానికి వాపసు చేయకపోవడం దారుణం. అడ్వాన్స్‌లు ఇచ్చింది గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో అయినా... గత వైసీపీ ప్రభుత్వం కూడా ఈ డీలర్ల నుంచి ఆ సొమ్మును వసూలు చేయలేకపోవడానికి ఆ అధికారే కారణమని చెప్తున్నారు. ప్రస్తుతం రిటైర్ అయిన ఆ అధికారి ఆ డీలర్ ఆ అధికారికి బినామీనేనని... అందుకే గతంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రులుగా పనిచేసిన పినిపె విశ్వరూప్, మేరుగ నాగార్జునలు కూడా డీలర్‌కు ఇచ్చిన అడ్వాన్స్ తిరిగి రాబట్టుకునేందుకు విఫలయత్నాలు చేశారన్న అపవాదు ఉంది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గతంలో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని అమలు చేసే క్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఈ-ఆటోలను కొనుగోలు చేసేందుకు టెండర్లు పిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో చెత్తను సేకరించి వాటిని ఘనవ్యర్థాల షెడ్‌కు తరలించి సేంద్రియ ఎరువులు తయారుచేయాలనేది లక్ష్యం. అందుకోసం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఈ-ఆటోలను ఎస్సీ యువత ద్వారా కొనుగోలు చేసి వాటిని చెత్తను తరలించేందుకు గ్రామ పంచాయతీల్లో వినియోగించాలని నిర్ణయించారు. 2017-18, 2018-19 సంవత్సరాలకు సంబంధించి జాతీయ సఫాయి కర్మచారీ ఆర్థిక అభివృద్ధి సంస్థ(ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ), జాతీయ ఎస్సీ ఆర్థిక అభివృద్ధి సంస్థ నిధులు(ఎన్ఎస్ఎఫ్‌డీసీ) వాడుకోవాలని నిర్ణయించారు. రాష్ట్ర వ్యాప్తంగా అప్పటి ఉమ్మడి 13 జిల్లాల్లో 13 ఈ-ఆటో సర్వీసు కేంద్రాలను ప్రారంభించాలని, భవిష్యత్తులో 42 సర్వీసు కేంద్రాలుగా విస్తరించాలని ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. అప్పట్లో ఈ-ఆటోలను సరఫరా చేసేందుకు పుణెకు చెందిన కెనటిక్ గ్రీన్ ఎనర్జీ అండ్ పవర్ సొల్యూషన్స్ లిమిటెడ్ సంస్థ ఆథరైజేషన్‌తో తాడేపల్లికి చెందిన వెంకటేశ్వర ట్రేడర్స్ ఒప్పందం చేసుకుంది. ఈమేరకు 7500 పవర్ ఆటోలు సరఫరా చేయాలని ఒప్పందం చేసుకుని రూ.77.91 కోట్లు అడ్వాన్స్‌గా పొందారు. కొనుగోలు ఆర్డర్‌ను ఎస్సీ కార్పొరేషన్ వీసీ అండ్ ఎండీ ఇచ్చారు. అయితే అనిల్‌కుమార్‌రెడ్డి రూ.57.98 కోట్ల విలువ కలిగిన 2,550 వాహనాలు మాత్రమే సరఫరా చేశారు. ఇంకా 4,950 వాహనాలు సరఫరా చేయాల్సి ఉంది. అడ్వాన్స్ ఇంకా రూ.19.92 కోట్లు ఆయన వద్దనే మిగిలిపోయింది. అనిల్‌కుమార్‌రెడ్డి ఈగల్ అగ్రి ఎక్విప్‌మెంట్, కావలి పేరుతో 280 మెకనైజ్డ్ డ్రైయిన్ క్లీనింగ్ మెషిన్లు సరఫరా చేస్తామని రూ.23.72 కోట్లు అడ్వాన్స్ తీసుకుని రూ.14.27 కోట్లు విలువ కలిగిన 209 మెషిన్లు మాత్రమే సరఫరా చేశారు. ఇంకా 71 మెషిన్లు సరఫరా చేయాల్సి ఉన్నప్పటికీ అవి సరఫరా చేయకపోగా తిరిగి చెల్లించాల్సిన రూ.9.45 కోట్లు కోట్లు తిరిగి చెల్లించలేదు. ఇదే కంపెనీ 660 ట్రాక్టర్లు సరఫరా చేస్తామని రూ.38.87 కోట్లు అడ్వాన్స్ తీసుకుని రూ.26.56 కోట్లు విలువ కలిగిన 451 ట్రాక్టర్లు మాత్రమే సరఫరా చేశారు. తిరిగి చెల్లించాల్సిన రూ.12.31 కోట్లు డీలర్ వద్దనే ఉన్నాయి. వెరసి ఒక్క అనిల్‌కుమార్‌రెడ్డి వద్దనే రూ.41.68 కోట్లు నిలిచిపోయాయి. ఇదే రకంగా మరో డీలర్ రాధా మాధవ్ ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ 1647 ఇన్నోవాలు ఇతియోస్ వాహనాలు సరఫరా చేస్తామని రూ.221.64 కోట్లు అడ్వాన్స్ తీసుకుంది. రూ.198.59 కోట్ల విలువ కలిగిన1417 వాహనాలు సరఫరా చేసింది. ఇంకా 230 వాహనాలు సరఫరా చేయాల్సి ఉంది. అడ్వాన్స్‌లో రూ.23.05 కోట్లు డీలర్ వద్దనే నిలిచిపోయింది. తిరిగి చెల్లించడం లేదు. అప్పటి ధరల ప్రకారం వాహనాలు ఇవ్వలేమని, పెరిగిన ధరల ప్రకారం తీసుకునేందుకు అంగీకరిస్తే పరిశీలిస్తామని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నట్లు తెలుస్తోంది. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఎంట్రాన్ ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ 15 మెకనైజ్డ్ డ్రైయిన్ క్లీనింగ్ మెషిన్లు సరఫరా చేస్తామని రూ.3.52 కోట్లు అడ్వాన్స్‌గా తీసుకుని 6 మెషిన్లు సరఫరా చేసింది. ఇంకా 9 వాహనాలు సరఫరా చేయలేదు. వారు తీసుకున్న అడ్వాన్స్ ఇంకా రూ.2.93 కోట్లు ఆ కంపెనీ వద్దనే మిగిలి ఉంది. మొత్తంగా ముగ్గురు వ్యక్తులు కలిసి మొత్తం రూ.67.67 కోట్లు అడ్వాన్స్ ఎస్సీ కార్పొరేషన్‌కు తిరిగి చెల్లించాల్సి ఉండగా పట్టించుకోవడం లేదు. ఎస్సీ కార్పొరేషన్‌తో ఒప్పందం చేసుకున్న నేపథ్యంలో కెనటిక్ గ్రీన్ ఎనర్జీ సంస్థ నుంచి రూ.7.72 కోట్లకు గాను ఐసీఐసీఐ బ్యాంక్ జారీచేసిన ఈఎండీని సమర్పించారు. ఈ ఈఎండీ బ్యాంక్ గ్యారెంటీ జనవరి 24, 2022 వరకు గడువు ఉండేట్లు తీసుకున్నారు. ఈ బ్యాంక్ గ్యారెంటీని సమర్పించిన తర్వాత ఎస్సీ కార్పొరేషన్‌కు లేఖ రాస్తూ మొత్తం సరఫరా చేసే ఈ-ఆటోల విలువలో 25 శాతం మొత్తంతో పాటు రూ.1.50 కోట్ల ఈఎండీ మొత్తాన్ని అడ్వాన్స్‌గా చెల్లించాలని ఎస్సీ కార్పొరేషన్‌కు సంస్థ లేఖ రాసింది. ఈ చెల్లింపులు సంస్థ ఆథరైజ్డ్ డీలర్ వెంకటేశ్వర ట్రేడర్స్‌కు చెల్లించాలని ఆథరైజ్ చేసింది. అయితే ఆ తర్వాత కెనటిక్ గ్రీన్ ఎనర్జీ అండ్ పవర్ సొల్యూషన్స్ లిమిటెడ్ సమర్పించిన బ్యాంక్ గ్యారెంటీ నకిలీదని తేలింది. దీనిపై ఎన్ని నోటీసులిచ్చినా వెంకటేశ్వర ట్రేడర్స్ లెక్కచేయలేదు. ఆ తర్వాత మంత్రి విశ్వరూప్ పదవి మారడంతో కొత్తగా వచ్చిన మంత్రి మేరుగ నాగార్జున కూడా అడ్వాన్స్ తిరిగి చెల్లించాలని డీలర్లకు హెచ్చరించడంతో ప్రభుత్వ పెద్దలు రంగంలోకి దిగారు. సీఎం కార్యాలయం నుంచి, ప్రభుత్వ పెద్దల నుంచి ఫోన్లు రావడంతో అడ్వాన్స్ తిరిగి చెల్లించే ప్రక్రియ ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఈ-ఆటోలను, ఇన్నోవాలను సరఫరా చేయని డీలర్ నుంచి అడ్వాన్స్‌ను తిరిగి రాబట్టడంలో సాక్షాత్తు ఆ శాఖ మంత్రులే విఫలమవ్వడం వెనుక ఆ ఉన్నతాధికారి హస్తముందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. జగన్ సర్కార్‌లో ఆ అధికారి కీలకంగా ఉన్నారని, ఆయన మాట చెల్లుబాటు కావడంతోనే ఐదేళ్ల పాటు ఈ అవినీతిని కప్పిపుచ్చుకోగలిగారని పేర్కొంటున్నారు.

అవయవాల రవాణా సమయంలో
ఎయిర్ ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలి

వైద్య సిబ్బందికి రిజర్వేషన్, ముందు సీట్లు కేటాయించాలి.. కేంద్రం మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 4: అవయవ దానంతో మరొకరికి ప్రాణదానం చేయొచ్చు. అయితే.. అవయవ దాత, గ్రహీత వేర్వేరు నగరాల్లో లేదా రాష్ట్రాల్లో ఉన్నప్పుడు సజీవ అవయవాన్ని వీలైనంత త్వరగా రవాణా చేయాల్సి ఉంటుంది. ఏ మాత్రం ఆలస్యం జరిగినా ప్రయత్నమంతా వృథా అవుతుంది. అందుకే అవయవ రవాణాలో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఉండేందుకు అవలంబించాల్సిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్ఓపీ)ని కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. విమానాలతో సహా వివిధ ప్రయాణ మార్గాల ద్వారా అవయవాలను అత్యంత వేగంగా రవాణా చేసేందుకు ఈ ఎస్ఓపీ వీలుకల్పిస్తుంది. నీతి ఆయోగ్, నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్ వంటి సంస్థల భాగస్వామ్యంతో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తొలిసారిగా ఈ తరహా ఎస్ఓపీని రూపొందించింది. విమానాల్లో అవయవాలు రవాణా చేసే సమయంలో టేకాఫ్, ల్యాండింగ్ సమయాల్లో ఎయిర్ ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడడం, వైద్య సిబ్బందికి ప్రాధాన్య రిజర్వేషన్, ముందు వరుస సీట్లను కేటాయించడం, ఎయిర్‌పోర్టుకు చేరుకునే క్రమంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా గ్రీన్ కారిడార్ ఏర్పాటు వంటి అంశాలు దీనిలో ఉన్నాయి. అలాగే అంబులెన్స్, ఇతర రవాణా మార్గాల ద్వారా అవయవాల రవాణాను సులభతరం చేయడానికి నిర్దిష్ట అధికారులు లేదా ఏజెన్సీల అభ్యర్థన మేరకు గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేయవచ్చని దీనిలో పేర్కొన్నారు. రాష్ట్రంలోగానీ, ఒక నగరంలోగానీ అవయవ రవాణా కోసం 'గ్రీన్ కారిడార్' ఏర్పాటుకు సమస్యలేమైనా ఉంటే వాటిని పరిష్కరించేందుకు పోలీస్ శాఖకు చెందిన ఒక నోడల్ అధికారిని నియమించవచ్చని సూచించారు.

సీఎం గారూ.. దయ చూపరూ!

- చంద్రబాబుకు ఖైదీల కుటుంబాల వేడుకోలు
- రెండున్నరేళ్లుగా 160 మంది సత్ప్రవర్తన ఖైదీల నిరీక్షణ
- తాజాగా ఏపీ సర్కారుకు జైళ్లశాఖ ప్రతిపాదనలతో ఆశలు

అమరావతి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తెలిసో తెలియకో.. పొరపాటునో.. క్షణికావేశంలోనో.. తప్పు చేసిన తమ వారిపై దయచూపండి చంద్రబాబు గారూ అంటూ రాష్ట్రంలోని పలు జైళ్లలో మగ్గుతున్న ఖైదీల కుటుంబాల సభ్యులు ముఖ్యమంత్రిని వేడుకొంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వైసీపీకి చెందిన కొందరు ఖైదీల విడుదలకు ఏమాత్రం అవకాశం లేకపోవడంతో, సత్ప్రవర్తన కలిగినప్పటికీ తమవారు ఇంకా జైళ్లలోనే మగ్గుతున్నారు. అయితే ప్రభుత్వం మారడంతో ఇప్పుడు బాధిత ఖైదీల కుటుంబాల్లో ఆశలు చిగురించాయి. వాస్తవానికి.. ఖైదీలను ప్రతి ఆర్నెళ్లకోసారి జూన్ 30లోపు మొదటి, డిసెంబరు 31లోపు రెండో జాబితా ఎంపిక చేసి విడుదల చేయాలని సుప్రీం కోర్టు 2021లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకాలు పంపింది. కొవిడ్ అనంతర పరిణామాలతో దేశ అత్యున్నత న్యాయస్థానం తీసుకున్న ఈ నిర్ణయాన్ని అటు కేంద్ర ప్రభుత్వం, దేశంలోని రాష్ట్రాలు సమ్మతించాయి. అయితే మన రాష్ట్రంలో నియంతలా పాలించిన జగన్ రెడ్డి అవేవీ పట్టించుకోలేదు. సుప్రీం కోర్టుతో ఇబ్బందులు వస్తాయని జైళ్ల శాఖ అధికారులు చెప్పినప్పటికీ పెడచెవిన పెట్టారు. పిట్టకథలు చెప్పడంలో పేరుగాంచిన రాయలసీమ మాజీ మంత్రి తమ బంధువులను విడుదల చేయించుకోవడానికి ప్రయత్నించారు. అయితే సుప్రీం కోర్టు మార్గదర్శకాల పరిధిలోకి ఆ ఖైదీలు రాబోరని జైళ్ల శాఖ అధికారులు చెప్పడంతో అర్హులైన వారిని సైతం విడుదల చేయకుండా వైసీపీ ప్రభుత్వం ఆపేసింది. అయినప్పటికీ ప్రతి ఆర్నెళ్లకోసారి అర్హుల జాబితా సుప్రీం మార్గదర్శకాల ప్రకారం సిద్ధం చేసి ప్రభుత్వానికి జైళ్ల శాఖ పంపింది. కోర్టుతో ఇబ్బందులు రాకుండా 2022లో ఒకసారి హోంశాఖ జీవో ఇచ్చింది తప్ప ఖైదీలను విడుదల చేయలేదు. ఇదిలా ఉండగా ఈ ఏడాది కూడా జూన్ 30నాటికి ఏ జైలులో ఏ ఖైదీ అర్హుడో వివరిస్తూ 160మంది జాబితా వారం రోజుల క్రితం చంద్రబాబు ప్రభుత్వానికి ఏపీ జైళ్లశాఖ పంపింది. ఆగస్టు 15, జనవరి 26తో సంబంధం లేకుండా ఎప్పుడైనా విడుదల చేయవచ్చని ప్రతిపాదనల్లో పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయబోయే ఖైదీలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మార్గం సిద్ధం చేసింది. వీరికిఉపాధి కల్పించే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా జైళ్ల శాఖ పంపిన జాబితా ప్రకారం విడుదలకు అర్హులైన ఖైదీలు.. కోస్తాంధ్ర జైళ్లలో 72మంది, గుంటూరు రేంజ్ పరిధిలో 35మంది, రాయలసీమ జైళ్లలో 53మంది కలిపి మొత్తం 160 మంది ఉన్నారు.

నిస్తేజంలో రవాణా శాఖ

- ప్రజల సహనానికి 'వాహన్-పరివాహన్' పరీక్ష
- ఆన్‌లైన్ సేవల్లో గందరగోళం.. ఆగిపోయిన ఈ ప్రగతి
- ఆగిన ఐటీ ప్రాజెక్టులు.. తిరోగమనంలో రవాణా రంగం



అమరావతి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కోటిన్నరకు పైగా వాహనాలు... నాలుగున్నర వేల కోట్ల ఆదాయం... ఐదు కోట్ల మంది ప్రజలకు రవాణా సర్వీసులు... వేలాది రోడ్డు ప్రమాదాల కట్టడికి చర్యలు.. ఇంతటి కీలకమైన రవాణా శాఖ ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం అనాథలా ఉంది. ఆన్‌లైన్‌లో సేవలు గందరగోళంగా తయారయ్యాయి. గత ప్రభుత్వం సర్వీసు చార్జీ చెల్లించక పోవడంతో ఐటీ విభాగం అస్తవ్యస్తమైంది.. వాహన్-పరివాహన్ మూడేళ్లుగా విజయవాడలో పైలట్‌కే పరిమితం కావడంతో సేవల పొందాలంటే తలప్రాణం తోకలోకి వస్తోంది. 2019కు ముందు చంద్రబాబు ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలతో ఏకంగా 83రకాలా ఆర్టీఏ సేవలు ఆన్‌లైన్లో అందేవి.. డ్రైవింగ్ లైసెన్స్ పొందాలంటే ట్రాక్‌లో టెస్ట్ కోసం దరఖాస్తుదారు వెళ్లాలి. వాహనమైతే ఫిట్ నెస్ కోసమే ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లాలి. మిగతా అనుమతులు, పన్నులు, ఇతర సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే అందుబాటులో ఉండేవి. ప్రజలు వాటికి అలవాటు పడి ఇప్పుడు ఈ ప్రగతి ద్వారానే చెల్లింపులు, సర్వీసులు పొందేవారు. వాహన డీలర్లు, ఫైనాన్సియర్లు, ఉత్పత్తిదారులు అందరూ ఆన్‌లైన్‌లోనే అన్నీ పూర్తి చేసేవారు. జగన్ ప్రభుత్వం వచ్చాక ఈ ప్రగతిని ఆపేసింది. డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఆర్‌సీ కార్డుల సరఫరా నిలిపేసింది. రాష్ట్రంలో రవాణా రంగమే తిరోగమనం బాట పట్టింది. ఇటు రవాణా శాఖ కమిషనర్ ఎం.కె. సిన్హా హైదరాబాద్ నుంచి విజయవాడలోని ఆఫీసుకు మంగళవారం వచ్చి శుక్రవారం మధ్యాహ్నం నుంచే వెళ్లిపోతుండటం, సంబంధిత శాఖ మంత్రి కూడా సమీక్షించక పోవడంతో ఆ ప్రభావం రవాణా సిబ్బంది పనితీరుపై చూపుతోంది. లారీ యజమానులు కమిషనర్ వద్దకెళ్లి తమ సమస్య చెబితే అవన్నీ భరించాలి తప్పదని ఆయన సమాధనం ఇవ్వడంతో దిక్కుతోచక వెనక్కి తిరిగొచ్చారు. ఐటీ విభాగంలో మ్యాన్ పవర్ సర్వీసెస్‌కు డబ్బులు ఇవ్వకపోగా ఏడాది నుంచి కనీసం రెగ్యులర్ చేయట్లేదు. ఫలితంగా మెన్‌పవర్ సర్వీసులో ఉద్యోగులు మానేసి వెళ్లిపోతుండటంతో రవాణా సేవలకు బ్రేక్ పడింది.

ఐటీ ప్రాజెక్టులన్నీ బంద్...

రవాణా సేవలన్నీ ఇంటి నుంచే ప్రజలు పొందేందుకు ఆ శాఖలో ఐటీ విభాగం కీలకంగా పనిచేసేది. రవాణా వాహన యజమానులు తాత్కాలిక అనుమతి తీసుకోవాలన్నా, త్రైమాసిక పన్నులు చెల్లించాలన్నా ఐటీ విభాగం పనితీరుతోనే ముడిపడి ఉండేది. ఇలా ఐటీకి అధిక ప్రాధాన్యం ఇచ్చే చంద్రబాబు ప్రభుత్వంలో వాహన ట్రాకింగ్ సిస్టమ్ తీసుకొచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా కేంద్రం కూడా కోట్లాది రూపాయల నిధులు తమ వాటాగా ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేసి ఐదు కోట్ల రూపాయలు మూడేళ్ల క్రితమే విడుదల చేసింది. వైసీపీ ప్రభుత్వం తన వాటా నిధులు విడుదల చేయక పోవడంతో ఏ వాహనం ఎక్కడుందో తెలిసేలా ఆర్టీఏ తీసుకు రావాలనుకున్న ప్రాజెక్టు షెడ్డుకు చేరింది.

ఆగిపోయిన అభయ

ఆడబిడ్డలకు ఆపదొస్తే గన్ కన్నా ముందుగా జగన్ వస్తాడంటూ ఆయన అనుయాయులు పదే పదే చెప్పేవారు. అయితే ఆటోల్లో ప్రయాణించే మహిళలు, యువతుల రక్షణ కోసం అభయ(ఆటో, ట్యాక్సీ ప్రయాణాల్లో ఆపదొస్తే నొక్కే బటన్) ప్రాజెక్టు కోసం కేంద్రం 50కోట్లు విడుదల చేసింది. వైసీపీ ప్రభుత్వం కొంత మ్యాచింగ్ ఇచ్చేందుకు మనసురాక ప్రాజెక్టునే పట్టించుకోకుండా వదిలేసింది. ఇలాంటివి చూసుకోవాల్సిన ఐటీ విభాగం అధికారి శ్రీదేవి ఏడాది పాటు సెలవులో వెళ్లారు. డబ్బులివ్వకుంటే నేను సర్వీసు ఇవ్వలేనంటూ ఐటీ మెన్ పవర్ కాంట్రాక్టరు గోడు వెల్లబోసుకొంటున్నట్లు సమాచారం. మరోవైపు వాహన్-పరివాహన్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకుండానే ఈ ప్రగతి ఆపేయడంపై విజయవాడలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నేడు జూట్ కార్మికుల నిరసన

కొత్తవలస, ఆగస్టు 4: కొత్తవలస ఉమా జూట్ మిల్లులో అక్రమ లాకౌట్ ఎత్తివేయాలని కోరుతూ సోమవారం జూట్ మిల్లు సమీపంలో ఉన్న యూనియన్ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ కార్మికుల ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించనున్నట్టు కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు గణేష్ పాండా తెలిపారు. గత నెల 15వ తేదీన జూట్ మిల్లులో యాజమాన్యం లాకౌట్ విధించిందని, ఈ కారణంగా 400 మంది కార్మిక కుటుంబాలు ఉపాధి కోల్పోయి వీధిన పడాల్సి వచ్చిందన్నారు. అక్రమా లాకౌట్ ఎత్తివేయాలని, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలు ఇచ్చామన్నారు. సమస్య పరిష్కారం కోసం యాజమాన్యం, కార్మికసంఘంతో ఈ నెల 2న చర్చలు జరపాలని డీసీఎల్‌కు తెలియజేశామని, డీసీఎల్ వద్ద చర్చకు కార్మి సంఘం హాజరైనా యాజమాన్యం హాజరుకాలేదన్నారు. యాజమాన్యానికి సంబంధించిన వాటాదారులందరూ స్థానికులేనని, ఉద్దేశపూర్వకంగానే సమస్యను జటిలం చేయడానికి యాజమాన్యం వాయిదాలు కోరుతోందన్నారు. ఇక తమకు గత్యంతరం లేక సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించి, తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తామన్నారు.

కొత్తవలసలో రక్తదాన శిబిరం

కొత్తవలస: కొత్తవలస-విజయనగరం రోడ్డులో ఉన్న శ్రీనివాస ఫంక్షన్ హాల్లో కొత్తవలసకు చెందిన సుబ్బలక్ష్మీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటి వారి సహకారంతో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్టు ట్రస్టు ఛైర్మన్ కనకాల శివ తెలిపారు. ఈ శిబిరంలో 32 మంది దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారన్నారు. రెడ్ క్రాస్ ఛైర్మన్ వై.శివనాగేంద్రరెడ్డి, ట్రస్టు సభ్యులు మీసాల దుర్గా ప్రసాద్, పి.శివరామకృష్ణ, చవితిన మురళి, కర్రిచిన్న, బి.గిరిధర్, ఆర్టీసీ శర్మ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ

కొత్తవలస: కేరళ రాష్ట్రం వాయినాడ్‌లో వచ్చిన వరద బాధితుల కోసం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం విరాళాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఎం పార్టీ నాయకుడు గాడి అప్పారావు ఆధ్వర్యంలో ఆదివారం సీపీఎం కార్యకర్తలు ప్రతి షాపు, ఇంటింటికీ వెళ్లి విరాళాలు సేకరించారు. పార్టీ తరఫున సాయం అందించాలనే ధ్యేయంతో విరాళాల సేకరణ చేశామన్నారు. విరాళాలను పార్టీ ద్వారా బాధిత కుటుంబాలకు అందిస్తామన్నారు.

ఉపాధి బకాయిలను వెంటనే చెల్లించండి

కొత్తవలస: ఉపాధి పనులు చేసిన కూలీలకు వేతనాలను వెంటనే చెల్లించాలని జిల్లావ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు గాడి అప్పారావు డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో గ్రామాల్లో ఉపాధి పనులు చేసిన వేతనదారులకు 4 వారాలకు సంబంధించిన బిల్లులు జిల్లా వ్యాప్తంగా బకాయి ఉన్నాయని, ఇందుకు కారణాలు తెలియరాలేదన్నారు. ఉపాధి కూలీలకు సంబంధించిన బకాయిలను తక్షణమే జమచేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కృత్రిమ అవయవాలు పంపిణీ

కొత్తవలస: గురుదేవ చారిటబుల్‌ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం దివ్యాంగులకు కృతిమ అవయవాలను ట్రస్టు ఛైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు, వైస్ ఛైర్మన్ ఫణీంద్ర అందజేశారు. ట్రస్టు కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన కార్యక్రమంలో 20 మంది దివ్యాంగులకు వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్మన్ జగదీష్ బాబు మాట్లాడుతూ గతంలో కొలతలు తీసుకున్నవారిలో కొంతమందికి అవయవాలను తయారు చేయించామని, కృత్రిమ అవయవాల పంపిణీ నిరంతరం జరుగుతుందన్నారు. కొత్తగా వచ్చే దివ్యాంగులకు పంపిణీ చేయడమే కాకుండా కృత్రిమ అవయవాలు రిపేర్లకు వచ్చిన వాటిని మళ్లీ రిపేర్లు చేయించి అందిస్తామన్నారు. కొలతలు లేకుండా అవయవాలు ఇవ్వడం జరగదని, కొలతలు ప్రకారం తయారు చేయడం వలన బాధితులకు సౌకర్యవంతంగా ఉంటాయన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు

లక్కవరపుకోట: మండలంలో జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆదివారం పార్టీ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ ఆధ్వర్యాన చేపట్టారు. సుమారు వంద మందికి పైగా సభ్యత్వాలు తీసుకున్నారు. అలాగే రేగ గ్రామంలో కూడా జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రావాడ నాయుడు, శివాజీ, పూలిబంటి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వేసిన ఒక్కరోజులోనే పీకేశారు

లక్కవరపుకోట: మండలంలో అక్రమార్కుల ఆగడాలకు హద్దు లేకుండా పోతుంది. భూకబ్జాదారులు రెవెన్యూ అధికారుల హెచ్చరికలను ఖాతరు చేయడం లేదు. తామరాపల్లి రెవన్యూ సర్వే నెంబరు 3, 11, 12, 13లలో కొంత ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది. దీనికి సంబంధించి రెవెన్యూ అధికారులు శనివారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. వేసి ఒక్కరోజు కూడా ముగియక ముందే కబ్జాదారులు బోర్డులను పీకిపారేశారు. రెవెన్యూ చట్టంపై కనీసం భయం కూడా లేకపోయిందని గ్రామానికి చెందిన కొంత మంది రైతులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దీనిపై తహసీల్దార్ ప్రసాదరావును వివరణ కోరగా సోమవారం పూర్తి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

బొబ్బిలి: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఉదయం పదిగంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక-మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిషనర్ లాలం రామలక్ష్మి తెలిపారు. పట్టణంలోని అన్ని వార్డులకు చెందిన ప్రజలు తమ సమస్యలను ఈ వేదిక దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని ఆమె సూచించారు.

చదవడం మాకిష్టం

తెర్లాం: మండలంలోని స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ సీహెచ్.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో అక్బర్, బీర్బల్ కథలు, అరేబియన్ నైట్ కథలు, బుద్ధిని బోధనలు, ఆలీబాబా 40 దొంగలు కథలు, అమ్మ చెప్పిన నీతి కథలు, అల్లూరి సీతారామరాజు కథలు చదివించారు. చిల్డ్రన్స్ క్లబ్‌లో భాగంగా విద్యార్థులకు ఇంగ్లిషు పదాల పోటీలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

78 మందికి కంటి పరీక్షలు

వేపాడ: మండల కేంద్రంలోని వేపాడ పాలకేంద్రంలో ఆదివారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సారధ్యంలో నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో కంటి వైద్య నిపుణులు చందన 78 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి 48 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. అనంతరం 43మందిని శస్త్ర చికిత్సల నిమిత్తం శంకర్ ఫౌండేషన్‌కు ప్రత్యేక వాహనంలో తరలించారు. కార్యక్రమంలో క్యాంపు కోఆర్డినేటర్ జోగారావు, స్థానిక పెద్దలు పాల్గొని సేవలు అందించారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు గురుకుల విద్యార్థులు

సాలూరు రూరల్: బొడ్డవలస బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యార్థులు జనార్దన సాయి, ఇసాక్‌లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఆశీర్వాదం, ఫిజికల్ డైరెక్టర్ విద్యాసాగర్ చెప్పారు. ఈ మేరకు విజయనగరం జిల్లా పారాది జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపికలు నిర్వహించినట్లు తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో ఈ నెల 17 నుంచి 19 వరకు జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

సబ్ డివిజన్ చేయండి మహాప్రభో

- సంవత్సరాలుగా అధికారులకు మాజీ సైనికుల విన్నపాలు
- ఇళ్ల స్థలాలకు నోచుకోని వైనం
- కలగా మిగిలిన సైనిక ఆసుపత్రి, క్యాంటీన్



మాజీ సైనికులకు కేటాయించిన స్థలం చదును చేస్తున్న దృశ్యం (ఫైల్)

విజయనగరం (ఆంధ్రజ్యోతి), ఆగస్టు 4

దేశ రక్షణ కోసం అహోరాత్రులూ శ్రమించి.. పదవీ విరమణ తరువాత సొంతూరుకు వచ్చి.. సంతోషంగా జీవించాలనుకున్న మాజీ సైనికులకు ఇక్కడి నేతలు, అధికారుల నుంచి కనీస సహకారం కరువైంది. స్థలం ఉన్నా ఇళ్లు నిర్మించుకునే పరిస్థితి లేదు. వారికి కేటాయించిన భూములను సబ్ డివిజన్ చేయకపోవడంతో భూమి ఉన్నా ఉపయోగం లేకుండా పోతోంది. పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేసినా ప్రయోజనం ఉండడం లేదు.

- గాజులరేగలోని సర్వే నెంబరు 1/84, 1/85లో 351 మంది మాజీ సైనికులకు 2009 ఆగస్టు 15న స్థలం కేటాయించారు. కొండపోరంబోకులో కేటాయించిన ఈ 15 ఎకరాల స్థలంలో మాజీ సైనికులు తమ సొంత ఖర్చులతో ఒక మంచినీటి బోరు, తాత్కాలికంగా ఒక గది, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకున్నారు.. 8.5 ఎకరాలను చదును కూడా చేశారు.. అయితే ఆ స్థలాన్ని ప్రభుత్వం నిర్దేశించిన విధంగా తీసుకునే వీలు మాత్రం లేకుండా పోయింది. స్థలాలను సబ్ డివిజన్ చేయకపోవడమే ఈ పరిస్థితి కారణం. ఈ 351 మంది సుదీర్ఘంగా ఇళ్ల స్థలాల సబ్ డివిజన్ కోసం కోసం ఎదురుచూస్తున్నారు. దీనిపై మాజీ సైనికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, ఇళ్ల స్థలాలు పొందిన వారు అధికారులకు వినతులు సమర్పిస్తున్నా స్పందనే లేకుండా పోయింది.

కలగానే ఆసుపత్రి, క్యాంటీన్..

మాజీ సైనికుల కోసం ఆసుపత్రి, క్యాంటీన్ నిర్మాణం కలగానే మిగులుతున్నాయి. ఈ రెండింటికీ స్థలం 2006లోనే కేటాయించారు.. 2006 నుంచి ఇంత వరకూ కేటాయించిన స్థలాన్ని మాజీ సైనికులే కాపాడుకుంటూ వస్తున్నారు.. 2006లో గాజులరేగలోని సర్వే నెంబరు 95/4లో స్థలం కేటాయించారు. ఈ స్థలానికి కూడా మాజీ సైనికులు తమ సొంత ఖర్చులతో ఫెన్సింగ్ వేసుకుని.. ఆ భూమిని రక్షించు కుంటున్నారు.. ఒక వైపు ఇళ్ల సమస్య తీరడం లేదు.. మరోవైపు విజయనగరంలో మిలట్రీ ఆసుపత్రి, క్యాంటీన్ ఏర్పాటు వంటి సమస్యలూ పరిష్కారం కావడం లేదు.

బ్యాంకులు రుణాలివ్వడం లేదు..



గాజులరేగ రెవిన్యూ పరిధిలోని మాజీ సైనికులకు కేటాయించిన ఇళ్ల స్థలాలు సబ్‌డివిజన్ చెయ్యాలని, గత 14 ఏళ్లుగా అధికారులను అభ్యర్థిస్తున్నాం. అనేక మంది వీరమాతలు, మాజీసైనికులు ఇందుకోసం నిరీక్షిస్తున్నారు. సొంత ఖర్చులతో 8.5 ఎకరాల స్థలాన్ని చదును చేసుకున్నాం. పట్టాలు పంపిణీ చేశారు కానీ ఎవరి స్థలం వారికి కేటాయించలేదు. అలా చెయ్యకపోవడంతో బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు. ఇకనైన ప్రజా ప్రతినిధులు, కలెక్టర్, ఆర్డీఓ చొరవ చూపి త్వరితగతిన సబ్‌డివిజన్ చెయ్యాలని కోరుతున్నాం.

-దేవర ఈశ్వరావు, అధ్యక్షుడు, మాజీ సైనిక సంక్షేమ సంఘం

ఆగస్టు 15న మళ్లీ ప్రభుత్వ అన్న క్యాంటీన్లు

- నా సొంతసొమ్ముతో ఇన్నాళ్లూ కొనసాగించా: బేబీనాయన

బొబ్బిలి, ఆగస్టు 4: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి మానసపుత్రికలు అన్నక్యాంటీన్‌లు అని, ఆ కారణంగానే గత ప్రభుత్వం ఐదేళ్ల పాటు వాటి ఉనికిని పూర్తిగా సర్వనాశనం చేసిందని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన ఆరోపించారు. స్థానిక అన్న క్యాంటీన్‌ను మూసివేసినప్పటికీ తన సొంత నిధులతో 772 రోజులుగా నిర్వహిస్తున్న సందర్భంగా ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఈ క్యాంటీన్‌లో జరుపుకుని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్న క్యాంటీన్‌ను మూసివేయడమే కాక, తాను సొంత ఖర్చుతో నిర్వహిస్తున్న క్యాంటీన్‌కు కూడా అనుమతి ఇవ్వకుండా నాటి ప్రభుత్వం అమానవీయంగా వ్యవహరించిందన్నారు. క్యాంటీన్ లోపల కాకుండా కనీసం గేటు లోపల పేదలు భోజనం చేసేందుకు అనుమతించమని ఎంత ప్రాధేయపడినా అంగీకరించలేదన్నారు. బొబ్బిలిటౌన్‌లో పాటు రామభద్రపురం మండల కేంద్రంలో రైతుల కోసం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌కు వంద వారాలు పూర్తయ్యాయన్నారు. ఎంతోమంది దాతలు, సేవకులు వచ్చి అన్న క్యాంటీన్లను నిర్వహించారని, అన్నార్తులంతా పెద్ద సంఖ్యలో వస్తుండడం ఆనందంగా ఉందన్నారు. దీనిని స్ఫూర్తిగా తీసుకుని ప్రభుత్వపరంగా అన్న క్యాంటీన్లను ఈ నెల 15 నుంచి ప్రారంభిస్తున్నప్పటికీ, తన పరంగా వారానికోసారి పలు చోట్ల యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు, కింతలి బంగారాజు-శ్రీదేవి, సీనియర్ నాయకులు రౌతు రామ్మూర్తి, బొత్స అప్పులు, కౌన్సిలర్లు కళ్యంపూడి లక్ష్మీసత్యనారాయణ, బొత్స సురేష్, రమేష్ దంపతులు, ఏగిరెడ్డి శ్రీధర్, బీజపుచిన్నారావు, కంచి వెంకటరావు, ఎక్కుడు వాసు, టీడీపీ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్‌లో వడ్డిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

మంత్రి సంధ్యారాణి దృష్టికి సమస్యలు



మంత్రికి సమస్యలు వివరిస్తున్న శంకరరావు

రామభద్రపురం, ఆగస్టు 4: రాష్ట్ర గిరిజన శాఖామంత్రి గుమ్మడి సంధ్యారాణి దృష్టికి మండలంలోని రొంపల్లి గ్రామపంచాయతీకి సంబంధించిన ప్రధాన సమస్యలను తీసుకు వెళ్లినట్టు ఎంపీటీసీ సభ్యులు, తెలుగుదేశం సీనియర్ నాయకుడు భవిరెడ్డి శంకరరావు తెలిపారు. ఆదివారం ఆమె స్వగృహంలో ఈ మేరకు శివరాంపురం బ్రిడ్జి పూర్తిచేసి రొంపల్లి మీదుగా బొబ్బిలికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, జోగిందొరవలస గిరిజన భూములకు సాగుపట్టాలు ఇవ్వాలని, రొంపల్లి పంచాయతీ ప్రధాన సమస్యలను కూడా ఆమెకు వివరించామని తెలిపారు. దీనిపై జిల్లా కలెక్టర్ అంబేడ్కర్‌తో మాట్లాడి ఈ సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సామరోతు రామారావు, తాడ్డి ఆదినారాయణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అశోక్ గజపతిరాజుతో ఎంపీ కలిశెట్టి భేటీ



అశోక్ గజపతిరాజుతో మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి

విజయనగరం రూరల్: కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజుతో ఆదివారం విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు టీడీపీ కార్యాలయంలో భేటీ అయ్యారు. పార్లమెంటు సమావేశాల్లో విజయనగరం పార్లమెంటు పరిధిలోని అపరిష్కృతంగా ఉన్న సమస్యలు, జరగాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఉత్తరాంధ్ర ప్రాంతం విజయనగరం పార్లమెంటుకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అశోక్ సూచించారు.

సమస్యలు పరిష్కరించాకే సర్దుబాటు

బొబ్బిలి: గత ప్రభుత్వ హయాంలో పాఠశాల విద్యను అస్తవ్యస్తంగా తయారు చేశారని, అప్పుడు జరిగిన పెనునష్టాన్ని పూరించిన తరువాతనే కొత్తగా పని సర్దుబాటు విధానాన్ని అమలు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి స్థానిక ఎన్‌జీవో హోమ్‌లో పలు మండలాల ఏపీటీఎఫ్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సీనియర్ నేత బంకురు జోగినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జేసీ రాజు మాట్లాడారు. ఇంత వరకు జీవో 117ని రద్దు చేయకపోవడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోందన్నారు. జనవరి నుంచి జూన్ వరకు అనేక మంది ఉపాధ్యాయులు పదవీ విరమణ చేసినందున తక్షణమే పదోన్నతులు కల్పించిన తరువాతనే సర్దుబాటు ప్రక్రియ నిర్వహించాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బొత్స పద్మావతి, సింహాచలం, ప్రవీణ్‌కుమార్, ఎల్లయ్య, రామకృష్ణ, లక్ష్మణరావు, దర్శనం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నేత జేసీ రాజు

ఒక్కొక్కరూ ఓ మొక్క నాటుదాం

రాజాం: ప్రతిఒక్కరూ ఒక్క మొక్కను నాటి దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చని రాజాం పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యులు ఆర్వీజే నాయుడు తదితరులు స్పష్టం చేశారు. ఇప్పటికే రాజాం పట్టణ, పరిసర ప్రాంతాలలో వెయ్యి మొక్కల్ని నాటినట్లు వెల్లడించారు. ఇక్కడి అమ్మవారి కాలనీలో ఆదివారం మొక్కలు నాటారు. పెంకి చైతన్యకుమార్, పండూరు వేణుగోపాల్ తదితరులంతా పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని ఎం.బూర్జవలస గ్రామంలో ఆదివారం శ్రీ సత్యసాయి మండలి సభ్యులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్క నాటి వాటిని సంరక్షించేలా కృషి చేయాలన్నారు. బి.లక్ష్మణ, సింహాచలం, రామినాయుడు, మధుసూదనరావు, సాయికుమార్, జనార్దన రావు, స్వామినాయుడు తదితురులు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: వీర బొబ్బిలి మాజీ సైనికులు ఆదివారం బొబ్బిలి పాత కోటలో గల మాజీ సైనిక కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు రేవళ్ల కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. అనంతరం గ్రీన్ బెల్ట్ సొసైటీ సౌజన్యంతో మొక్కలు బహూకరిస్తూ శుభాకాంక్షలు తెలుపు కుంటూ మొక్కలు నాటారు. మాజీ సైనికులు కెప్టెన్ పోలయ్య, అప్పలనాయుడు, మోహనరావు, పాపారావు, లక్ష్మణరావు, సురేష్ బాబు, రామినాయుడు, ఈశ్వరరావు, బంగారినాయుడు, వనమిత్ర కృష్ణదాస్, రమణమూర్తి పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు



రాష్ట్రస్థాయి చెస్‌పోటీల విజేతలు

విజయనగరం టౌన్, ఆగస్టు 4: జిల్లా కేంద్రంలో ఉన్న గురుజాడ పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న 2024 అండర్-7 రాష్ట్రస్థాయి చదరంగంపోటీలు ఆదివారంతో ముగిశాయి. బాలికల చెస్ చాంపియన్‌షిప్‌లో భాగంగా విజేతలుగా ప్రథమ స్థానంలో ఏఎస్ఎస్ఎస్ కావ్య(గుంటూరు) ద్వితీయ స్థానంలో వేదష్వి(తూర్పుగోదావరి) బాలుర విభాగంలో ఎ.శశాంక్ (పశ్చిమగోదావరి) మాగ్నష్(పల్నాడు) ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పార్వతీపురం మన్యం జిల్లా పంచాయతీ రాజ్ సూపరింటెండెంట్ ఎంవీఆర్ కృష్ణాజీ, రాష్ట్ర చెస్ అసోషియేషన్ కార్యదర్శి ఎస్.భీమారావు, టోర్నమెంట్ డైరెక్టర్, రాష్ట్ర కోశాధికారి జ్వాలాముఖి, వైస్ ప్రెసిడెంట్ మస్తాన్‌బాబు పాల్గొని బహుమతి ప్రదానం చేశారు.

ఇసుకపై వైసీపీ నేతల మాటలు అభ్యంతరకరం

- విలేకర్ల సమావేశంలో రేగిడి మండల టీడీపీ



మాట్లాడుతున్న మండల టీడీపీ నేతలు

రేగిడి, ఆగస్టు 4: వైసీపీ ప్రభుత్వంలో రేగిడి మండలంలో వెలుగుచూసిన ఇసుక, సిమెంట్ కుంభకోణంలో నిజానిజాలు నిగ్గుతేల్చాలని, అప్పట్లో వీడీ చేసిన దర్యాప్తు నివేదికలు బైటపెట్టాలని, దీనిపై సమగ్ర విచారణకు ఆదేశించాలని మండల టీడీపీ పార్టీ ప్రభుత్వానికి సూచించింది. ఆదివారం మండలకేంద్రంలో మండలటీడీపీ పార్టీ అధ్యక్షులు కిమిడి అశోక్‌కుమార్, మరోనేత డీసీసీబీ మాజీ ఉపాధ్యక్షుడు దూబ ధర్మారావు ఆధ్వర్యంలో టీడీపీ నేతలు విలేఖర్లు సమావేశం నిర్వహించి వైసీపీ నేతల హయాంలో జరిగిన అవకతవకలు, జనరల్‌బాడీ సమావేశాల్లో వైకాపానేతల వ్యవహారశైలిని తప్పుపట్టారు. మండలపరిషత్ జనరల్‌బాడీ సమావేశాల్లో వైసీపీ పెద్దలు అధికారులను భయభ్రాంతులకు గురిచేసే హెచ్చరికలు మానుకోవాలని, ఇసుకదందాల్లో ఆరితేరిన వైసీపీ నేతలు, ప్రభుత్వం మారాక ఇసుక అక్రమరవాణాపై అధికారులకు సూచనలు చేయటం హాస్యాస్పదం అని మండల టీడీపీ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. గత మూడేళ్ల మండలపరిషత్ నిధుల వ్యయంలో అనుమానాలు ఉన్నాయని, దీనిపై అధికారులకు ఫిర్యాదుచేసి దర్యాప్తు కోరుతామని, దీంతో పాటు మండలపరిషత్ ప్రాంగణంలో పదుల సంఖ్యలో విలువైన చెట్లు అడ్డుగోలుగా నరికివేసి సొమ్ముచేసుకున్నారని, దీనిపై సమగ్ర విచారణ జరపాలన్నారు. ఇసుక అక్రమరవాణాపై వైసీపీ హయాంలో పెద్దనేతలు లారీలతో, చోటానేతలు ట్రాక్టర్లతో ఇసుక దందాలు చేసినవారు ఇప్పుడు జనరల్‌బాడీ సమావేశంలో అక్రమరవాణాపై అధికార్లకు సూచనలు చేయటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని విమర్శంచారు. సమావేశంలో మండల టీడీపీ సీనియర్ నాయకులు పాలూరి రామినాయుడు, పాలూరి రామచంద్రినాయుడు, గురువాన ధనంజయ్‌రావు, తాడేళ్ల దామోదర్‌రావు, పార్టీనాయకులు తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

రాజాం రూరల్: రాజాం నియోజకవర్గస్థాయి ఫోటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఇక్కడి తృప్తి రిసార్ట్‌లో ఆదివారం నిర్వహించిన సంఘ సర్వసభ్య సమావేశంలో సంఘ అధ్యక్షుడిగా ఎం.చందు, కార్యదర్శిగా రాము, కోశాధికారిగా పద్మనాభం, తదితరులు ఎన్నికయ్యారు.

వీధి కుక్కలదాడిలో 40 నాటుకోళ్లు మృతి



కుక్కలదాడిలో బలైన నాటుకోళ్లు

తెర్లాం: వీధికుక్కల దాడిచేయడంతో నాటు కోళ్లు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని పాముల వలస పంచాయతీ ఎంబి.వలస గ్రామంలో కాళ్ల సూర్యనారాయణకు చెందిన నాటుకోళ్ల ఫారంలోకి ఆదివారం ఉదయం 7.30 గంటల సమయంలో వీధి కుక్కలు చొరబడ్డాయి. ఫారంలో ఎవరూ లేకపోవడంతో కుక్కలు కోళ్లపై దాడి చేశాయి. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన 40 నాటుకోళ్లు మృత్యువాత పడ్డాయి. దీంతో అధికంగా ఆస్తినష్టం జరిగిందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

రేగిడి: మండలంలో లచ్చన్నవలస వద్ద శనివారం అర్ధరాత్రి అక్రమంగా లోడు చేస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను సీజ్‌చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. గ్రామపొలిమేరల్లో ఇసుక కుప్పలను నిల్వాచేసి ఇసుక తరలిస్తుండగా రైడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వృద్ధురాలి మృతి

సంతకవిటి: మండల పరిధిలో కొత్తూరు రామచంద్రాపురం గ్రామంలో ఇటీవల దాడికి గురైన వృద్ధురాలు చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. దీనికి సంబంధించి ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కాయల ఎల్లమ్మ(60) చాలా కాలంగా గ్రామంలో ఒంటరిగానే జీవిస్తోంది. ఈ నెల 2న అదే గ్రామానికి చెందిన తేగల రాము ఆమెపై దాడి చేసి గాయపరిచాడు. అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెను స్థానికులు రిమ్స్‌కు తరలించి చికిత్స అందించగా అక్కడ చికిత్స పొందతూ శనివారం రాత్రి మృతి చెందింది. దాడికి పాల్పడిన రాముపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

తప్పిన ప్రమాదం



అదుపుతప్పి తాటిచెట్టును ఢీకొన్న వ్యాన్

శృంగవరపుకోట రూరల్: మండలంలోని రాజీపేట గ్రామం వద్ద ఆదివారం ఉదయం ప్రమాదం చోటు చేసుకుంది. ఎస్.కోట నుంచి అల్లూరి సీతారామ రాజు జిల్లా అరుకు ప్రాంతానికి ఒక వ్యాన్‌లో ఇటుకును తీసుకెళ్తున్నారన్నారు. అయితే రాజీపేట గ్రామం దాటగానే ముందు టైరు పేలిపోవడంతో వ్యాన్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఒక తాటిచెట్టును ఢీకొట్టింది. ప్రమాద సమయంలో క్యాబిన్‌లో ముగ్గురు ఇరుక్కుపోయారు. అప్రమత్తమైన స్థానికులు వెంటనే వారిని జేసీబీ సాయంతో బయటకు సురక్షితంగా తీయడంతో పెను ప్రమాదం తప్పింది. ఇదే సమయంలో ఎదురుగా వాహనాలు రాకపోవడంతో అందరూ ఊపిరి పిల్చుకున్నారు.

డీఎస్సీ, టెట్‌కు ఉచితంగా శిక్షణ

- జిల్లా గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలో గిరిజన అభ్యర్థులకు డీఎస్సీ, టెట్ కోసం ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు 200 మంది వరకు సీతంపేట, మందస వైటీసీలో శిక్షణ ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ డీఈడీతోపాటు, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులు సంబంధిత డిగ్రీ, బీఈడీ తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. లాంగ్వేజ్ పండిట్ అభ్యర్థులకు సంబంధించి డిగ్రీ పండిట్ శిక్షణ బీఈడీ పాసై ఉండాలని, పీఈటీ అభ్యర్థులు ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. మన్యం జిల్లాలోని సీతంపేట, భామిని, వీరఘట్టం, పాలకొండ మండలాలతో పాటు శ్రీకాకుళం జిల్లాలోని గిరిజన అభ్యర్థులు కూడా ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఈనెల 11వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తులు అందజేయాలని, 8978455324 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ఓటుబ్యాంకు రాజకీయం కోసం చిచ్చు పెట్టారు

శృంగవరపుకోట రూరల్: ఓటుబ్యాంకు రాజకీయాలకోసం షెడ్యూల్‌కులాలు, తెగల మధ్య కులాలచిచ్చు రగిల్చారని ప్రజాగాయకుడు, పాటలతూటా అతవ ఉదయ్‌భాస్కర్ అన్నారు. ఆదివారం మండలంలోని ధర్మవరం గ్రామంలో స్థానిక దళితసంఘాల నేతలు గుర్రపు శ్రీనివాసరావు, జోలకేశవలతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు అన్యాయం అని వాపోయారు. ఈ తీర్పు ద్వారా బలహీన వర్గాలను హేళన చేయడమే అని సుప్రీం తీర్పును ఖండిస్తూ ఈనెల 21 భారత్ బంద్‌కు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. అన్ని మండల కేంద్రాల్లో బంద్ ఉంటుందన్నారు. దళితసంఘాల నాయకులు బండ అప్పన్న, తెరపల్లి కొటరావు, దేబారికి అప్పారావు, బోసీశేఖర్, లోతేటి ఈశ్వరరావు, గాలి క్రాంతి, జోల రాము తదితరులున్నారు.

రైతుల శ్రమదానం



షట్టర్లు పైకి లేపుతున్న దృశ్యం

జామి: గడిచిన ఐదేళ్ల కాలంగా తమ భూములకు తాటిపూడి నీరు రాక పంటలు ఎండిపోతున్నాయని చెప్పినా నాటి ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోలేదు. దీంతో రైతులు శ్రమదానంతో తమ సమస్యను తీర్చుకున్నారు. ఆదివారం మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబు ఆధ్వర్యంలో జామి పల్లపుకాలువ రైతులు 60 మంది తమకు నీరు రాకుండా కిందకు దిగి ఉన్న ఆరు షట్టర్లను పైకిలేపి తమ పొలాలకు నీరు పారేలా చేసుకున్నారు.

కొట్టక్కి ఎత్తిపోతల పథకానికి మోక్షం

- 300 ఎకరాలకు సాగునీరు
- ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేస్తున్న బేబీనాయన
- సొంత నిధులు వెచ్చిస్తున్న ఎమ్మెల్యే

రామభద్రపురం, ఆగస్టు 4: కొట్టక్కి ఎత్తిపోతల పథకానికి గ్రహణం వీడి రైతులకు సాగునీరు అందించే దిశగా అడుగులు పడుతున్నాయి. గత ప్రభుత్వం ఈ పథకాన్ని మూలకు చేర్చడంతో రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన సొంత నిధులు వెచ్చించాలని నిర్ణయించారు. ఎత్తిపోతల పథకాన్ని మళ్లీ గాడిలో పెడుతున్నారు.

మండల తెలుగు యువత అధ్యక్షుడు ముల్లు రాంబాబు ఈ ఎత్తిపోతల పథకం వల్ల రైతులకు ఎంతో ఉపయోగం ఉందని బేబీనాయన దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి తుప్పుపట్టిన మోటార్లను బాగుచేయించి సంప్‌లో ఉన్న షిల్టును తీయించేందుకు నిధులు అందించారు. సుమారు లక్షా 50 వేల రూపాయలు అందించి పనులకు శ్రీకారం చుట్టడంతో కొట్టక్కి రైతుల ఆనందానికి అవధులు లేవు. 5 సంవత్సరాలుగా ఈ ఎత్తిపోతల పథకంపై గత ప్రభుత్వం కన్నెత్తి చూడలేదు. ప్రస్తుతం విద్యుత్ అంతరాయం కారణంగా ఈ ఖరీఫ్ సీజన్‌కు



నీరు అందించగలరా అన్న సందేహం రైతుల్లో నెలకొంది. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ బిగించి వెంటనే రైతులకు సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో అన్ని చర్యలు తీసుకుంటున్నారు. దీనిపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ సౌకర్యం వెంటనే కల్పించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

బేబీనాయనకు రైతులు రుణ పడి ఉంటారు

ఎన్నో దశాబ్దాల క్రితం నిర్మించిన కొట్టక్కి ఎత్తిపోతల పథకంపై గత పాలకులు సీతకన్ను వేయడంతో రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను చూసి బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన తన సొంత నిధులు వెచ్చించేందుకు ముందుకొచ్చారు. పథకానికి మరమ్మతులు చేయించి సుమారు 300 ఎకరాలు సాగునీటికి అవకాశం కల్పించిన బేబీనాయనకు ఈ ప్రాంత రైతులంతా రుణపడి ఉంటారు.

- ముల్లు రాంబాబు, తెలుగు యువత మండల అధ్యక్షుడు

నోటీసులు ఉపసంహరించుకోవాలి

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు



నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులు

పాలకొండ: వలంటీర్లను సర్వీసుల నుంచి తొలగిస్తూ జారీచేసిన నోటీసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు డిమాండ్‌చేశారు. ఆదివారం పాలకొండ నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ఏపీసచివాలయం, గ్రామ,వార్డు వలంటీర్ల యూనియన్‌ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నగర పంచాయతీ కార్యాలయం పరిధిలో వీవర్స్‌కాలనీ వార్డు సచివాలయంలో ప్రస్తుతం పనిచేస్తున్న 11 మంది, శ్రీరామ కళామందిరం వార్డు సచివాలయం ఐదుమంది వలంటీర్లను సర్వీసుల నుంచి తొలగిస్తూ నోటీసులు మూడో తేదీన వాట్సాప్ ద్వారా పంపించినట్లు తెలిపారు. వీవర్స్‌కాలనీ వార్డు సచివాలయం అడ్మిన్ సెక్రటరీ సమాచారం మేరకు తొలగిస్తున్నట్టు నోటీసు ఇవ్వడం కక్షసాధింపు చర్యల్లో భాగమేనని చెప్పారు. పాలకొండ నగరపంచాయతీలో మొత్తం 17మంది వలంటీర్లు రాజీనామా చేయలేదని రమణారావు పేర్కొన్నారు. వీవర్స్ కాలనీ అడ్మిన్ సెక్రటరీ వలంటీర్‌కు గైర్హాజరయ్యారని పేరుమీద తొలగించం సరైనది కాదన్నారు. రాజకీయ ఒత్తిడికి అంద రూ రాజీనామా చేసినా, 17 మంది రాజీనామాలు చేయకుండా విధి నిర్వహణలో ఉంటే వారికి వేతనాలు కూడా ఇవ్వలేన్నారు. తక్షణమే నోటీసులను ఉప సంహరించుకోవాలని కోరారు.

చందాలు సేకరించి.. రక్షణ గోడ నిర్మించి

● చిదిమి జంక్షన్‌లో ఏర్పాటుచేసిన గోడను పరిశీలించిన డీఎస్పీ



నిర్మించిన రక్షణ గోడను పరిశీలిస్తున్న డీఎస్పీ కృష్ణారావు

పాలకొండ: మండలంలోని చిదిమి జంక్షన్‌లో ఎస్ఐ చొరవతో దాతల నుంచి చందాల రూపంలో సేకరించి రక్షణ గోడ నిర్మించారు. చిదిమి జంక్షన్ వద్ద గతనెల 21న పాలకొండ వైపు నుంచి సిమెంట్‌లోడుతో వస్తున్న లారీఅదుపు తప్పి కల్వర్టు, రక్షణ గోడను ఢీకొట్టడంతో రక్షణగోడ పడిపోయింది. అప్పటినుంచి పోలీసులు ప్రమాదాలు జరగకుండా డ్రమ్ములను అమర్చారు. ఈనేపథ్యంలో ఆర్‌అండ్‌బీ అధికారులతో డీఎస్పీ కృష్ణారావు సంప్రదించగా తమ వద్ద నిధులు లేవని తెలిపారు. దీంతో ఎస్ఐ దాతలతో మాట్లాడి వారి సహకారంతో ఇటుకలు, సిమెంట్ సేకరించి 50 అడుగుల పొడవు, నాలుగు అడుగుల ఎత్తుతో రక్షణ గోడను ఆర్‌అండ్‌బీ శాఖ అధికారుల సూచనలతో నిర్మించారు. ఈ మేరకు ఆదివారం డీఎస్పీ కృష్ణారావు రక్షణ గోడను పరిశీలించి సీఐ చంద్రమౌళి, ఎస్ఐ ప్రకుద్దీన్‌లను అభినందించారు. వాహన ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచనలు చేశారు.

పిచ్చిమొక్కలను తొలగించాలి

పాలకొండ-వీరఘట్టం రోడ్డులో ఇరువైపులా పెరిగి పిచ్చిమొక్కలు తొలగించాలని పాలకొండ డీఎస్పీ జీవీకృష్ణారావు సిబ్బందికి ఆదేశించారు. ఆదివారం మండలంలోని అట్టలి జంక్షన్ వద్ద వాహన తనిఖీలను నిర్వహించారు. అనంతరం పిచ్చిమొక్కలను పెరగడాన్ని గమనించి ప్రమాదాలు జరగకముందే తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక మార్గం అవసరం

వీరఘట్టం: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణించాలని పాలకొండ సత్యసాయి ప్రతినిధి ఎన్‌వీ రమణ తెలిపారు. ఆదివారం వీరఘట్టంలోని శాంతి ఆశ్రమంలో ఆధ్యాత్మిక సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవుడు ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకోవాలంటే ఆధ్యాత్మిక మార్గం అవసమన్నారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక వక్తలు కర్రి గోపన్న, కర్రి శ్రీరామనాయుడు, అరిటికట్ల కామేశ్వరరావు, మోహన్‌దాస్, భక్తులు పాల్గొన్నారు.

స్వామి దయానంద సరస్వతికి ఘన నివాళి

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేటలో ఏఎం ఫర్ సేవ అనాథాశ్రమంలో హిందూ తత్వవేత్త స్వామి దయానంద సరస్వతి 94వ జయంతి పురస్కరించుకుని ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీస్వామి స్థర్యానంద సరస్వతి ఆశ్రమపీఠాధిపతి మాట్లాడుతూ ఇటువంటి ఆశ్రమాలు పేద విద్యార్థులను ఆదుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో సాల వెంకట అప్పారావు, పుల్లెల శ్రీనివాసరావు, గోన ప్రసాదరావు, కొత్త రవికుమార్, నల్ల సురేష్ పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ

సీతానగరం: కేరళలోని వాయనాడ్ జిల్లాలో వరద బాధితుల కోసం సీతానగరం మండల సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు.ఈ మేరకు సేకరించిన రూ.5,067 పార్టీ మన్యం జిల్లా కమిటీకి అందజేశారు. జిల్లా కమిటీ సేకరించిన విరాళాలను కేరళ సీఎం సహాయ నిధికి అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎంనాయకులు రెడ్డి ఈశ్వరరావు, రెడ్డి లక్ష్మంనాయుడు, గరవ వెంకటరమణ, వి.రామలక్ష్మి, బి.అప్పారావు, ఆర్.రాము, సీహెచ్ కృష్ణ, పి.చిన్నారావు పాల్గొన్నారు.

వీరఘట్టంలో వర్షం

వీరఘట్టం: వీరఘట్టం తదితర గ్రామాల్లో ఆదివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి గంట పాటు వర్షం కురిసింది. నాట్లు వేస్తున్న సమయంలో వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించండి



మొక్క నాటుతున్న సభ్యులు

రాయగడ: అమ్మ పేరుతో ఓ మొక్క నాటి, పర్యావరణ పరిరక్షించాలని ప్రముఖనేత్ర వైద్యుడు, సాయిప్రియ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఎం.సురేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం రాయగడలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానాటికి భూతాపం పెరిగిపోతోందని దీంతో మున్ముందు ప్రాణవాయువు లభించడం చాలాకష్టంగా మారనుందని పేర్కొన్నారు.అందుకే ముందుచూపుతో ప్రతిఒక్కరూ మొక్కలు నాటి భావి తరాలకు ప్రాణవాయువు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సూర్యనారాయణ శర్మ,ఉపాధ్యక్షులు ధర్మరాజు, జయకృష్ణ ప్రధాన్, దేబరాజ్ పండా తదితరులు పాల్గొన్నారు. కాగా స్థానిక హౌసింగ్ బోర్డులో ఉన్న శక్తి వృద్ధాశ్రమంలో అనాథవృద్ధులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు.

సృష్టిలో స్నేహానికి మించిన సంపద లేదు



మైత్రీ దినోత్సవంలో పాల్గొన్న వాకర్స్ సభ్యులు

రాయగడ: సృష్టిలో స్నేహానికి మించిన సంపద లేదని సాయిప్రియ మహిళా వాకర్స్‌క్లబ్ సభ్యులు తెలిపారు. రాయగడ రైస్‌మిల్లులో స్నేహితుల దినోత్సవం పురస్కరించుకుని మైత్రీ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లాడి చంద్రమౌళి పాల్గొన్నారు.

సాహిత్యంతో సమాజాన్ని మేల్కొలపాలి

రాయగడ: సాహిత్యంతో సామాజాన్ని మేల్కొలపాలని, రచయిత సమాజాన్ని చైతన్యం పరిచే దిశగా రచనలు చేయాలని విశ్రాంత ఉపాధ్యాయుడు మామిడి గణపతిరావు తెలిపారు.ఆదివారం రాయగడలో రాయగడ రచయితల సంఘం (రారసం)సమావేశం సంఘం అధ్యక్షుడు టీపీఎస్‌ఆర్ అప్పారావు అధ్యక్షతన నిర్వహించారు. డాక్టర్ పతివాడు తులసీదాస్ భర్తృహరి సభాషితా ల్లోని వివరాలను తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ గురుమూర్తి, బాబురావు మహంతి, పి.రామ్మోహనరావు, కె.గౌరిప్రసాద్, పిల్లల శంకరరావు, సత్యనారా యణ, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ లేక.. ఆదాయం రాక

● వైసీపీ హయాంలో నీరుగార్చిన వైనం
● పర్యాటకుల ఆకర్షించేందుకు పీవో చర్యలు
● ప్రైవేటు భాగస్వామ్యంపై దృష్టి
● ఇదీ సీతంపేటలో అడ్వంచర్ పార్క్ పరిస్థితి



సీతంపేటలో ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్



అడ్వంచర్ పార్క్‌లో పరిసరాలు

సీతంపేట: సీతంపేటలోని ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌ను వైసీపీ ప్రభుత్వం హయాంలో నిర్వహణ లేకపోవడంతో పర్యాటకులు రాక ఆదాయ మార్గాలు మూసుకుపోయాయి. అప్పట్లో వైసీపీ హయాంలో పార్క్‌ను నీరుగార్చారని పర్యాటకులు ఆరోపిస్తున్నారు. దీంతో పార్క్ నిర్వహణ కష్టతరంగా మారింది. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పార్క్ అభివృద్ధిచేసి పర్యాటకులను పెంచి ఆదాయం పెంపొందించాలని నిర్ణయించింది.

పూర్వవైభవానికి చర్యలు..

సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్ అభివృద్ధికి పీవో దృష్టి సారించారు. ప్రధానంగా ఆదాయం పెంచడంతోపాటు పర్యాటకులను ఆకర్షించేందుకు చర్యలు చేపట్టారు. ప్రధానంగా ప్రైవేటు భాగస్వామ్యంతో నిధులు సమకూర్చి పార్క్‌ను పూర్వవైభవం తీసుకురావడానికి మార్గాలను అన్వేషిస్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్ పర్యాటకులను ఆకర్షించే విధంగా తీర్చిదిద్దారు. దీంతో ప్రతిరోజూ నాలుగు వేల మంది పర్యాటకులు సందర్శించేవారు. వీకెండ్ సమయంలో మరింత పర్యాటకులు సందర్శించడంతో అధిక ఆదాయం సమకూరేది. అడ్వంచర్ పార్క్‌తోపాటు పరోక్షంగా చిన్న తరహా వ్యాపారులు జీవనం పొందేవారు. 2019 తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్క్ నిర్వహణ ఆశించిన స్థాయిలో లేకపోవడంతో పర్యాటకులు తాకిడి తగ్గి నిర్వహణ కష్టతరంగా మారింది. దీంతో పార్క్‌లో కొన్ని వినోద కార్యక్రమాలు నిలిచిపోయే పరిస్థితి నెలకొనడంతో సిబ్బంది జీతాలు కూడా ఇవ్వలేని స్థితిలో ఏర్పడింది. వీటిని దృష్టిలో పెట్టుకొని సీతంపేట టూరిజం హబ్‌గా తీర్చిదిద్ది అడ్వంచర్ పార్క్‌ను పూర్వ వైభవం తీసుకురావడానికి పీవో నడుం బిగించారు. వీటితో పాటు మెట్టుగూడ జలపాతం, ఆదలి వ్యూపాయింట్ పర్యాటకులను ఆకర్షించే విధంగా రూపుదిద్దుతున్నారు.

అరకు కాఫీ స్టాల్ ఏర్పాటు..

అడ్వంచర్ పార్క్‌కు వచ్చిన పర్యాటకులకు అరకు కాఫీను అందజేయాలన్న ఉద్దేశ్యంతో స్టాల్‌ను ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు రూపొందించారు. దీంతో ఈ ప్రాంతంలో అరకు కాఫీ విస్తృతంగా అమ్మకాలు జరిగేలా నిరుద్యోగ గిరిజన యువతకు ఉపాధి లభించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సీతంపేట పర్యాటక ప్రాంతం పూర్వ వైభవం వస్తుందని నమ్మకం పర్యాటకులకు కలుగుతోంది. ఇప్పటికే మూలకు చేరిన వాహనాలను మరమ్మతులు చేసి పర్యాటకులకు మరింత వినోదాన్ని అందించే ప్రయత్నం చేస్తున్నారు.



పాలకొండ: పూజల్లో పాల్గొన్న మహిళలు



మక్కువ: కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరిదేవి పూజలు

పాలకొండ: పట్టణంలోని దేవాంగులవీధి, బోనంవీధి, వెంకమ్మపేట, వీవర్స్ కాలనీల్లో దేవాంగుల కులదైవం చౌడేశ్వరిదేవి జయంతి పురస్కరించుకుని ఆదివారం చౌడేశ్వరిదేవికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా చౌడేశ్వరిదేవి ప్రతిమను ఊరేగించారు. అనంతరం వీవర్స్‌కాలనీలో అమ్మవారి ప్రతిమకు కుంకుమార్చనలు, అభిషేకాలను అర్చకులు దార్లపూడిలక్ష్మీ ప్రసాదశర్మ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా దేవాంగ కులస్థులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు.

● **మక్కువ:** స్థానిక శ్రీసాయి రామలింగేశ్వర ఆలయ ఆవరణలో దేవాంగులు చౌడేశ్వరిదేవి పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా పండితులు మణికంఠ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు కుంకుమపూజల్లో పాల్గొన్నారు.



పార్వతీపురంటౌన్: స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్న వాకర్స్‌సభ్యులు



సాలూరు రూరల్: ఏవోబీలో ఉల్లాసంగా నృత్యం చేస్తున్న స్నేహితులు

స్నేహితుడే గొప్పవాడు

● పార్వతీపురం, సాలూరు మండలంలో స్నేహితుల దినోత్సవం

పార్వతీపురంటౌన్: స్నేహితుడు కంటే గొప్పవాడు లేడని, ప్రతిఒక్కరూ స్నేహితులను గుర్తుంచుకోవాలని వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ జె.నారాయణ స్వామి తెలిపారు. ఆదివారం పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో మార్నింగ్ స్టార్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ స్నేహితుల దినోత్సవం నిర్వహించారు. అనంతరం సామాజిక సేవకుడు కె.కృష్ణ మూర్తిని గవర్నర్‌తో మార్నింగ్ స్టార్ వాకర్స్ క్లబ్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో వాకర్స్‌ఇంటర్నేషనల్ ఏరియా మాజీ వైస్ ప్రెసిడెంట్ ఐ.గున్నేష్, మార్నింగ్ స్టార్, నోబుల్ వాకర్స్‌క్లబ్ అధ్యక్షులు పి.సత్యనారాయణ, ఆర్.సత్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

● **సాలూరు రూరల్:** గోముఖి గంగ, దళాయివలస, రాందారి, గాలిగబుదారు తదితర జలపాతాలు, ఏవోబీలో స్నేహితుల దినోత్సవం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో యువత సందడిదా గడిపారు.

పాలనలో మహిళ పాత్ర పెరగాలి: ఎమ్మెల్యే



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మహిళ నాయకులు

పార్వతీపురంటౌన్: స్థానిక సంస్థల పాలనలో మహిళ పాత్ర పెరగాలని ఎమ్మెల్యే విజయచంద్ర కోరారు. ఆదివారం పార్వతీపురంలో ఎమ్మెల్యే సతీమణి, నియోజకవర్గ మహిళా నాయకురాలు బోనెల అనూష ఆధ్వర్యంలో మహిళా సాధికారిత సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యతులో అన్నిరంగాల్లో మహిళలు రాణిస్తారన్నారు. మహిళలకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. అనుష మాట్లాడుతూ మహిళలు అబలలు కాదు సబలలు అన్నసమయం ఆసన్నమైయ్యిందన్నారు. అనంతరం మహిళలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

రాష్ట్రానికి అన్ని విధాలా న్యాయం

రాష్ట్రానికి అన్ని విధాలా న్యాయం జరిగిందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. ఆదివారం పార్వతీపురంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం వెనుకబడిపోయిందని ఆందోళన వ్యక్తంచేశారు.

వల్లరిగుడబలో తల్లిపాల వారోత్సవాలు



పౌష్టికాహార ప్రదర్శన నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

గరుగుబిల్లి : మండలంలోని వల్లరిగుడబ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాలు ఆదివారం నిర్వహించారు.ఈ సందర్భంగా పౌష్టికాహార ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ వర్కర్లు ఎస్.అరుణకుమారి, కె.సుజాత ఆధ్వర్యంలో తల్లిపాలు వారోత్సవాల అవశ్యకత వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. తల్లిపాలు వల్ల బిడ్డకు కలిగే ప్రయోజనాలను వివరించారు. తల్లిపాలు బిడ్డకు దివ్య ఔషధమని, అమృతంతో సమానమని తెలియజేశారు. పుట్టిన బిడ్డకు ముర్రు పాలు తప్పనిసరిగా తాగించాలని కోరారు. క్రమం తప్పకుండా ఆరు నెలల వరకు తల్లిపాలు బిడ్డకు తాగించాలని వివరించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఆశవర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

గరుగుబిల్లిలో 'చదవడం మాకిష్టం'

గరుగుబిల్లి: గ్రంథాలయంలో సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ నిర్వాహకుడు నల్ల మధుసూదనరావు కోరారు. ఆదివారం గరుగుబిల్లిలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

గరుగుబిల్లిలో సుదర్శన హోమాలు

గరుగుబిల్లి: గరుగుబిల్లిలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం సుదర్శన హోమాలను ఘనంగా నిర్వహించారు.ఉదయం సుప్రభాత సేవ, ఆరాధన, అభిషేకాలు, అనంతరం ఆలయ ప్రాంగణంలో సుదర్శన హోమాలను వీరఘట్టానికి చెందిన యజ్ఞ యాగకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ పర్యవేక్షణలో రుత్వికులు సత్తె నరసింహాచార్యులు నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

చందాలు వేసుకుని.. పూడిక తొలగించి

● గుమ్మిడిగెడ్డ ప్రధాన కాలువలో పనులు

కురుపాం: గుమ్మిడిగెడ్డ ప్రధాన కాలువ పరిధిలో రైతులు చేయి చేయి కలిపి చందాలు వేసుకుని పూడిక తొలగింపు పనులు ఆదివారం ప్రారంభించారు. ప్రధాన కాలువలోపూడిక తీయకపోవడంతో ఆయకట్టుకు నీరందకపోవడంతో స్వచ్ఛందంగా పూడికతీతకు రైతులు ముందుకొచ్చారు. కురుపాం మండలంలోని గుమ్మిడిగెడ్డ మినీ రిజర్వాయర్ నుంచి జియ్యమ్మవలస మండలంలోని కన్నపుదొర వలస పరిధిలో మూడు వేల ఎకరాలకు నీరందించవలసిఉంది. ఆరేళ్లుగా పూడిక తీయకపోవడంతో నీరందకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. గతఏడాది వర్షాలు అనుకూలించడంతో నీటికి ఇబ్బందులు తలెత్తలేదు. అయితే ఈ ఏడాది సక్రంగా వర్షలు పడకపోవడం, ఇప్పటివరకు నీరు వదలక పోవడంతో రైతులు అధికారులకు కలిసినా ఫలితం లేకుండాపోయింది. దీంతో పూతికవలస, సీతంపేట, కన్నపుదొరవలస తదితరులు గ్రామాలు రైతులు చందాలు వేసుకుని యంత్రాలతో గుమ్మిడిగెడ్డ ప్రధాన కాలువ పరిధిలో పూడిక తొలగింపు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో రైతులు బంటు వెంకట నాయుడు, మర్రపు శేషు,మర్రపు సింహాచలం, పి.శ్రీను, శెట్టి శ్రీనివాసరావు, సూర్యనాయణ తదితరులు పాల్గొన్నారు.



కురుపాం: కాలువలో పూడిక తీస్తున్న రైతులు

తోటపల్లి ఎడమ కాలువలో..

వీరఘట్టం: తోటపల్లి ఎడమ కాలువ సబ్ చానల్ పరిధిలో కడకెల్ల నుంచి కొట్టుగుమ్మడ వరకు సుమారు 13 కిలోమీటర్లు పొడవైన కాలువలో టీడీపీ మండలాధ్యక్షుడు ఉదయాన ఉదయ్‌భాస్కర్ సొంత నిధులతో పిచ్చిమొక్కలు, పూడికలను తొలగిస్తున్నారు. కొట్టుగుమ్మడ, గడగమ్మ, కిమ్మి గ్రామాల ఆయకట్టుకు సాగునీరు సరిగా అందకపోవడంతో ఆయన స్పందించారు. మూడేళ్లుగా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో సొంత నిధులతో కాలువలో తొలగిస్తున్నట్లు ఉదయ్‌భాస్కర్ తెలిపారు.

శునకానికి దిన కర్మ



పాలకొండ: పట్టణంలోని సీతంపేట రోడ్డులో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి చేబోతుల రాజు తాను పెంచుకున్న శునకానికి దిన కర్మ ఆదివారం నిర్వహించాడు. రాజు 50 శునకాలను ప్రతి రోజూ ఆహారం పెట్టేవాడు. 15 ఏళ్లుగా పెంచుకున్న టైసాన్ అనే శునకం ఇటీవల మృతిచెందింది. దీంతో రాజు ఆ శునకానికి దినకర్మ ఆదివారం నిర్వహించాడు. ఈ సందర్భంగా వందలాది శునకాలను తీసుకొచ్చి ఆహారం అందజేశాడు.

ఉపాధ్యాయుడి మృతి

గరుగుబిల్లి: మండలంలోని నాగూరు గ్రామానికి చెందిన చదురు సింహాచలం (42) ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన లఖనాపురంలో ఎస్‌జీ టీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో ఇంటి వద్దే ఉన్న సమయంలో గుండెపోటు రావడంతో మృతి చెందారు. సింహాచలం మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. సింహాచలానికి తల్లిదండ్రులు జమ్మన్నదొర, చిన్నమ్మతోపాటు భార్య విశాలక్ష్మి, కుమారుడు యశ్వంత్ ఉన్నారు. ఈ మేరకు పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

హక్కుల కోసం పోరాడాలి

సీతంపేట రూరల్: గిరిజనుల హక్కుల సాధన కోసం ఆదివాసీలు ఐక్యతంగా పోరాడాలని గిరిజన సంఘం నాయకులు ఎం.తిరుపతిరావు, సాంబయ్య కోరారు.ఆదివారం మండలంలోని రామానగరంలో కె.పరశురాం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తిరుపతిరావు మాట్లాడుతు సీతంపేట ఏజెన్సీలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎన్డీఏ ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు జె.శ్రీరాములు, భాస్కరరావు పాల్గొన్నారు.

ఏఎన్ఎం పోస్టు భర్తీచేయాలి

సాలూరు రూరల్: మావుడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పండు కోరారు. ఆదివారం మావుడి పాఠశాల పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వంట నిర్వహణకు సిబ్బందికొరత వేధిస్తోందని తెలిపారు. పాఠశాలలో ఏఎన్‌ఎం పోస్టును వెంటనే భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నితిన్, సింహాద్రి పాల్గొన్నారు.